హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	:18004251442
యాదాద్రి	:1800 425 7106
సూర్యాపేట	:1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.142	220	240
సూర్యాపేట	రూ.170	240	270
నల్లగొండ	రూ.142	206	234

ఉష్ణోగ్రత గరిష్ఠం 38.0 । కనిష్ఠం 24.0

రామలింగేశ్వరా.. అక్రమాలు కనవా?



నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి ఆలయం

భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోన్న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అక్రమాల పరంపర కొనసాగుతోంది. పెద్దలీడర్ల పేరు చెప్పుకుంటున్న ఛోటా లీడర్లు, ఆలయంలో పనిచేసే అధికార యంత్రాంగం కుమ్మక్కయి ఆలయ నిర్వహణని గుప్పిటపట్టి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- చెర్వుగట్టు ఆలయ సంపదను కాజేస్తున్న అక్రమార్కులు
- సిండికేట్‌గా మారిన ఛోటా లీడర్లు, అధికార యంత్రాంగం
- బ్రహ్మోత్సవాల్లో సిండికేట్
- భారీగా చేతివాటం ప్రదర్శించిందనే ఆరోపణలు
- పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆర్డీవో విచారణ
- టెండర్ల బకాయిల వసూళ్లలోనూ నిర్లక్ష్యం

చెర్వుగట్టు దేవస్థానానికి భారీ ఆదాయం వస్తున్నా, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఏ విభాగంలో అవకాశమున్నవారు ఆ విభాగంలో రామలింగేశ్వరుని సంపదను బొక్కేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. టిక్కెట్లు, ప్రసాదాలు, తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్‌గేట్లు, పారిశుధ్య నిర్వహణ, టెండర్ల నిర్వహణ ఇలా.. ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ ఆలయ సంపదని కాజేస్తున్నారనే ఆరోపణలకు సమాధానం కరువైంది. ఇటీవల బ్రహ్మోత్సవాల నిర్వహణ జమా,ఖర్చుల్లో లోటు, భారీగా చేతివాటం ప్రదర్శించారనే ఫిర్యాదులు రావడంతో ఆర్డీవో అశోక్‌రెడ్డి విచారణ నిర్వహించారు. రెండు పర్యాయాలు ఆయన ఆలయాన్ని సందర్శించి రికార్డులు సీజ్ చేసి తీసుకెళ్లడం ఫిర్యాదులోని తీవ్రతను తెలియజేస్తోంది. ఆర్డీవో నివేదిక సమర్పిస్తే ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో జరిగిందో తేట తెల్లమవుతుందని, నివేదిక వచ్చాక ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపైనే సర్వత్రా ఆసక్తి కొనసాగుతోంది.

ఆ 'సిండికేట్' వైపే చూపిస్తోన్న అన్నివేళ్లు

చెర్వుగట్టు దేవస్థానంలో సిండికేట్‌గా మారిన వ్యక్తుల వల్లే ఇటీవల బ్రహ్మోత్సవాల ఆదాయం, ఇతరత్రా ఆలయ సంపద పక్కదారి పట్టిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆలయ నిర్వహణలో సుదీర్ఘకాలంగా తిష్టవేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితోపాటు, ఆలయాన్ని గుప్పిటపెట్టుకోవాలని చూస్తోన్న రాజకీయ నాయకులు సిండికేట్‌గా మారి స్వామివారి సంపదను కొల్లగొడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఆలయ పాలన, నిర్వహణను అస్తవ్యస్తంగా మార్చేశారు. అర్హత లేనివారికి ఆర్థిక నిర్వహణ బాధ్యతలప్పగించడం వంటి సంఘటనలు ఆలయ నిర్వహణ గాడితప్పిందనడానికి నిదర్శనంగా చెబుతున్నారు. ప్రధానంగా ఈ సిండికేట్ బ్రహ్మోత్సవాల సమయంలో దర్శన టిక్కెట్లు, ప్రసాదాల టిక్కెట్లు, తలనీలాల టిక్కెట్ల రీసైక్లింగ్‌కు పాల్పడిందనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేరాయి. అంతేకాకుండా అర్హతలేని వ్యక్తికి ఆర్థిక వ్యవహారాల నిర్వహణ బాధ్యతలివ్వడం, ఏ రోజుకారోజు జమా, ఖర్చులు రాయకపోవడం, నగదును బ్యాంకులో జమచేయకపోవడం వంటి లోపాలకు ఈ సిండికేటే కారణమని చెబుతున్నారు. బ్రహ్మోత్సవాల ఆదాయమే కాదు, రోజువారీ ఆదాయం విషయంలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని, పైగా టెండర్ల ద్వారా రావాల్సిన ఆదాయాన్ని సైతం సకాలంలో వసూలు చేయకుండా కాలయాపన చేసి చివరకు గడువు ముగిశాక భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయని చెబుతున్నారు. మొత్తంగా ఆలయ సంపదను అక్రమార్గంలో దోచుకుంటున్న సిండికేట్‌పై వచ్చిన ఫిర్యాదుతోనే ఆర్డీవో విచారణ జరిగిందని, ఈ సిండికేట్ ఉన్నతాధికారులపైనా ఒత్తిడి తెస్తోందని, నివేదికను బయటకు రాకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిండికేట్‌ని నిరోధిస్తే తప్ప చెర్వుగట్టు దేవస్థానంలో అవినీతికి అడ్డుకట్టపడదనే అభిప్రాయం భక్తుల్లో వెలువడుతోంది. సిండికేట్‌లో....

- మిగతా 8వ పేజీలో...

'రాజీవ్ యువవికాసం' మార్గదర్శకాలు ఇవే

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన యువతీ, యువలకు ఆర్థిక సాయం అందించడంకోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి సంబంధించి సోమవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్థికసాయం సంబంధించిన పథకాలకు రూ.50వేల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ, రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం సబ్సిడీ, 10శాతం బ్యాంకు రుణం ఇస్తారు. ఇక రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం ఇవ్వనుండగా, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం అందజేస్తారు. అత్యంత దుర్బలమైన పరిస్థితిలో ఉన్న వారికి లక్ష రూపాయల్లో 90శాతం సబ్సిడీ, 10 శాతం ఈఎంఎఫ్ ద్వారా అందజేస్తారు. చిన్న నీటి పారుదల పథకాలకు 100శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. పథకాల గ్రౌడింగ్‌కు ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి

త్రిపురారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాటూరు గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంకోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అనంతరం మండలంలోని మాటూరు, డొంకతండా, త్రిపురారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం పాల్గొన్నారు.

ప్యాడీ క్లీనింగ్ చేస్తేనే కాంటా వేస్తాం

- నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధికారులు
- తిప్పర్తి మార్కెట్‌లో నాలుగు రోజులుగా రైతుల అవస్థ



తిప్పర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్యాడీ క్లీనర్‌తో శుభ్రం చేసిన ధాన్యం మాత్రమే కాంటా వేయాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో నిర్వాహకులు కొనుగోళ్లు నిలిపివేశారు. ధాన్యంలో తాలు ఉందనే కారణంతో తిప్పర్తి మార్కెట్ యార్డులో నాలుగు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండు రోజుల క్రితం సుమారు మూడు వేల క్వింటాళ్ల ధాన్యం లోడ్ చేసేందుకు కాంటా వేసి ఉంచగా బస్తాలు పాడవకుండా లోడ్‌తో మిల్లులకు వెళ్లిన లారీలు ఇప్పటి వరకు దిగుమతి కాలేదు. ఈ కారణంతో లారీ యజమానులు లోడ్ చేసేందుకు అనుమతించలేదు. దీంతో మరో రెండు రోజులు కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇప్పటి నుంచి మంచి ధాన్యం పంపిస్తామని నిర్వాహకులు చెప్పడంతో రెండు, మూడు లారీల ధాన్యం దిగుమతి చేసుకున్న మిల్లు నిర్వాహకులు ఎక్కువ తాలు వస్తోందని ఆదివారం నుంచి దిగుమతి నిలిపివేశారు. దీంతో అక్కడికి వెళ్లిన నాలుగు లారీల ధాన్యం దిగుమతి కాకుండానే మిల్లుల్లోనే ఉండిపోయింది. ఈ కారణంతో సోమవారం తిప్పర్తి మార్కెట్‌లో కాంటా వేయడమే నిలిపివేశారు. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం సుమారు 25 వేల నుంచి 30 వేల క్వింటాళ్ల వరకు ఉండవచ్చు. ధాన్యం కాంటాలు నిలిచిపోయాయనే సమాచారంతో సోమవారం సాయంత్రం నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీసీవో పాఛ్చానాయక్‌లతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ధాన్యం ప్యాడీ క్లీనర్‌లతో శుభ్రం చేస్తే తప్ప కాంటా వేసేది లేదని నిర్వాహకులకు సూచించి వెళ్లారు. అదే విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్‌లో ప్యాడీ క్లీనర్ నడిచేలా విద్యుత్ సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరుశురామ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, ఏఈవో అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలి

బుద్ధపూర్ణిమ రోజు బుద్ధవనం సందర్శనకు రాక ▸▸ కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బుద్ధపూర్ణిమ సందర్భంగా మే 12న నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం సందర్శనకు వచ్చే మిస్ వరల్డ్ పోటీదారులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా ఏర్పాట్లపై తన ఛాంబర్‌లో పర్యాటక, రెవెన్యూ, పోలీస్, ఇతర అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆసియా దేశాలకు చెందిన 30 మంది ప్రపంచ సుందరి పోటీదారులు బుద్ధపూర్ణిమ సందర్భంగా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనానికి వస్తున్నారని, ఆ రోజు సాయంత్రం 4.30 నుంచి 7.30 వరకు విజయ విహార్, బుద్ధవనంలో వారు గడిపే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చే దారిలో చింతపల్లి వద్ద కాసేపు విశ్రాంతి తీసుకుని బుద్ధవనానికి చేరుకుంటారని, అనంతరం బుద్ధవనంలో జాతక వనాన్ని పరిశీలిస్తారని, అనంతరం బుద్ధుని ధ్యాన మందిరం వద్ద ధ్యానంలో పాల్గొంటారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు, బందోబస్తు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సూచనలు చేశారు. పాసులు ఉన్న వారిని తప్ప ఇతరులు ఎవరినీ బుద్ధ వనంలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. విజయ్ విహార్‌లో వారు విశ్రాంతి తీసుకునేందుకు గదులు సిద్ధం చేయాలని, ఒకవేళ నాగార్జునసాగర్ డ్యామ్‌ను చూసేందుకు వస్తే అక్కడ ఏర్పాట్లు చేయాలన్నారు. మునిసిపల్ సిబ్బంది తాగునీరు, దారి పొడవునా పరిశుభ్రం చేయాలన్నారు. ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే వారు తిరిగే అన్ని ప్రదేశాలను ముందే తిరిగి పరిశీలించాలని, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, మెడికల్ టీం, ఫైర్ టీములు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆహారం, తాగునీరుతో పాటు, అన్ని విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి ఒక్కో ప్రదేశం వద్ద ఒక సీఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, బుద్ధవనం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ సూదన్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్, మిర్యాలగూడ మునిసిపల్, రెవెన్యూ అధికారులు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలి

లబ్ధిదారులకు పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమైన కార్యక్రమాల నిర్వహణలో మండల ప్రత్యేక అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకించి ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి ఇదివరకే నిర్దేశించినట్లు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పౌష్టికాహారంపై మరోసారి సదస్సు

దేవరకొండ డివిజన్‌లో పౌష్టికాహార ప్రాముఖ్యం పై మరోసారి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులను భాగస్వామ్యం చేస్తామని ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ నెల 8 నుంచి పది రోజులపాటు పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, గర్భిణులు, పిల్లలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం ఆరోగ్య జాగ్రత్తలపై గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు తెలియజేసే విధంగా మరోసారి అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. టీఎస్ ఐ-పాస్ కింద వచ్చిన దరఖాస్తులను ఆమోదించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలి

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నివారణకు కృషిచేయాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనక భవిష్యత్తు' అనే అంశంపై ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సామాజిక వ్యాధి నివారణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మధురానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవడమే కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డబ్ల్యూహెచ్‌వో లెక్కల ప్రకారం ప్రతీ సంవత్సరం సుమారు మూడు లక్షల మంది మహిళలు ప్రసవం సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి నవజాత శిశువుల ఆరోగ్యమే కుటుంబాలు, సమాజాల శ్రేయస్సును ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేస్తుందన్నారు. తల్లి గర్భం దాల్చడానికి ముందునుంచే గుడ్లు, పాలు, ఆకు కూరలు, ఇతర కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, పిల్లలకు అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో హానికరమైన పదార్థాలకు (పొగాకు, మద్యం వంటివి) దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం పిల్లలు, గర్భిణులకు ప్రిన్సిపాల్ పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యరేఖ, ట్యూటర్లు డాక్టర్ శ్వేత, మధులత, హెల్త్ ఎడ్యుకేటర్లు స్వామి, నాగలక్ష్మి, జ్యోతి, ఆఫీస్ సిబ్బంది, ఆశా వర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి

నూతన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు





ఎమ్మెల్యేకోటాలో నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్, విజయశాంతి, నెల్లికంటి సత్యంలకు అభినందనలు తెలుపుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బాలునాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరేశం

కట్టంగూరు, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల, కురుమర్తి, చెర్వు అన్నారం, నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు, అక్కెనపల్లి, చిన్నతుమ్మల గూడెం, పల్లెపహాడ్‌లో సోమవారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కట్టంగూరులో డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, నర్సింహ, ఏవో గిరిప్రసాద్, నార్కట్‌పల్లి మండలంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా విజయవిహార్ ఆధునికీకరణ

- రూ.5కోట్లతో పూర్తికి కసరత్తు
- సాగర్‌కు రానున్న 140 దేశాల మిస్‌వరల్డ్ పోటీ యువతులు, దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు

6



ఆటాడుకుందాం

శారీరక, మానసిక వికాసంలో ఆటలకు ఉన్న ప్రాధాన్యం ఎంతో గొప్పది. పూర్వీకుల నుంచి ఆటల పట్ల ఉన్న ఆ ప్రాధాన్యం మాటల్లో చెప్పలేనిది. రేడియో, టెలివిజన్ వంటి వినోద సాధనాలు రాకముందు వినోదం, మానసిక చురుకుదనం, ఐక్యమత్యం, పట్టుదల, స్నేహ సంబంధాలతో పాటు ఆరోగ్యం, ఆనందానికి ఆటలు ప్రేరకాలుగా ఉండేవి. అందుబాటులో ఉన్న వస్తువులు, పరికరాలతో ఆట వస్తువులను తయారుచేసుకుని ఆడటం పూర్వపు రోజుల్లో కనిపించేవి. గ్రామాల్లో తీరిక వేళల్లో , వెన్నెల రాత్రుల్లో లింగబేధం లేకుండా, వయస్సుల తారతమ్యం పాటించకుండా ఆడేవారు. ఆటలు వారి జీవన ప్రయాణంలో భాగస్వామ్యమై ఉండేవి. అంతటి ప్రాధాన్యం ఉన్న అప్పటి ఆటల్లో కొన్ని....

- (ఆంధ్రజ్యోతి-యాదగిరిగుట్ట రూరల్)

- శారీరక ఆరోగ్యం, వినోదమే ప్రధానంగా అప్పటి ఆటలు
- పెరిగిన సాంకేతికతతో మరుగునపడ్డ ఆటలు
- డిజిటల్ గేమ్స్‌తో కనుమరుగు





రోజురోజుకూ సాంకేతికపరమైన వస్తువులపై మక్కువ చూపిస్తుండటంతో ఆటలపై పిల్లలో అనాసక్తి మొదలైంది. దీంతో గత కాలపు ఆటలు కనుమరుగయ్యే దశకు చేరుకున్నాయి. ప్రధానంగా అండ్రాయిడ్, గేమింగ్ ఫోన్లు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు పిల్లల చేతుల్లోకి రావడంతో శారీరక శ్రమకొర్చే ఆటలపై ఆసక్తి చూపించడం లేదు. దీంతో శరీరానికి శ్రమ కరువై వారు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రధానంగా చిన్నవయస్సులోనే కంటి సమస్య, పొట్ట రావడం, మానసికఒత్తిడితో అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. పిల్లలు అందరూకలిసి జట్టుగా ఆటలు ఆడకపోవడంతో పిల్లల మధ్య స్నేహ సంబంధాలు తగ్గిపోతున్నాయి. ఇప్పటికైనా తల్లిదండ్రులు స్పందించి గత ఆటల సంస్కృతీ, సంప్రదాయాలపై వారికి ఆసక్తిని కలిగించేలా, పిల్లలు స్మార్ట్‌ఫోన్లకు పరిమితం కాకుండా అందరితో కలిసి ఆడుకునేలా ప్రత్యేక దృష్టి సారించి ఆనాటి ఆటలు కనుమరుగు కాకుండా ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉంది. గతంలో పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలంటే ఇంటి నుంచి కిలోమీటర్ నుంచి సుమారు నాలుగు కిలో మీటర్ల దూరం కాలినడకన వెళ్లేవారు. దీంతో నడక చిన్నతనంలో అలవాటైపోవడంతో ఇప్పుడు వారు ఎంతో ఆరోగ్యం ఉన్నారు. అంతేకాకుండా పాఠశాల మైదానంలో విద్యార్థులు అందరూ కలిసి రకరకాలు ఆటలు ఆటడంతో వారిలో స్నేహబంధాలు, పట్టుదల, ఐక్యమత్యం, మానసిక ప్రశాంత ఏర్పడి ఎలాంటి రోగాల బారిన పడకుండా ఆరోగ్యవంతంగా ఉన్నారంటే అన్నింటికి కారణం ఆటలు. ప్రభుత్వాలు సైతం విద్యార్థులకు చదువుతో పాటుగా ఆటలపై అవగహన కల్పించి ప్రత్యేక దృష్టి సారించి ప్రతి పాఠశాలలో ప్రత్యేకంగా పీఈటీలను నియమించి చక్కదిద్దాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

గతకాలపు ఆటలు

టైరాట	వంగుడు దుంకుడు	కుంటరా గాడిద కుంటూ
వీరివీరి గుమ్మడిపండు	రేసాట	చిర్రగోనే
కోతికొమ్మచ్చి	బొమ్మరిల్లు	కబడ్డీ
అల్లం-దుర్గం	ముక్కు గిచ్చుడు	సీసం గోళీకాయల
బొంగారాల	దస్తే బిస్తడి	వనగుంటలు
కైలాసం	చెల్లెల బండి	పుంజీతం
అష్టాచమ్మ	గచ్చకాయల	చెస్
దోపుడుపుల్ల	ఉప్పు బెరలాట	క్యారంబోర్డు
నాలుగు రాళ్ల		

ప్రభుత్వాలు క్రీడలను ప్రోత్సహించాలి



ప్రభుత్వాలు క్రీడలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల్లో దాగియున్న నైపుణ్యాన్ని వెలికితీయాలి. క్రీడాకారులు మండల స్థాయి నుంచి అంచెలంచెలుగా ఎదుగుతూ జాతీయ స్థాయిలో రాణించేలా ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఆధారపడి ఉంది.

- పూల నాగయ్య, రిటైర్డ్ పీఈటీ

గచ్చకాయలు, ముక్కు గిచ్చుడు ఇష్టం



చిన్నప్పుడు గ్రామంలో సాయంకాలం స్నేహితులు అందరం కలిసి గచ్చకాయల ఆట, అష్టాచెమ్మ, దోపుడు పుల్ల, ఉప్పు బెరడు, చిక్కుడు బిల్ల, బొమ్మరిల్లు, సెల్లెల బండి ఆట ఆడుకోవడం ఎంతో సంతోషాన్ని ఇచ్చేది. తోటి స్నేహితులు ఎవరైనా గొడవపడితే ముక్కు గిచ్చుడు ఆట ఆడితే వారిని కోపంతో గట్టిగా గిచ్చేవాళ్లం. వేసవిలో ఇంటి నుంచి బయటకు వెళ్లకుండా అమ్మానాన్న కైలాసం ఆట ఆడించేవారు. ఎక్కువగా పాపాలు ఎవరు చేస్తే వారిని అనకొండ పాము మింగుతుందని అనడంతో ఎంతో భయపడేవాళ్లం. కైలాసం ఆట అంటే ఎంతో ఇష్టం.

- చంద్రగాని అయిలమ్మ, వంగపల్లి

చిర్రగోనె, కబడ్డీ ఆటలపై మక్కువ ఎక్కువ



గతంలో పాఠశాల వదలగానే ఇంటికి వెళ్లి నలుగురు కలిసి చిర్రగోనె, కబడ్డీ ఆటలు ఆడితే ఎంతో సంతోషంగా ఉండేది. స్నేహితులంతా కబడ్డీలో తాము గెలువాలం టే, తాము గెలుస్తామంటూ పోటాపోటీగా ఆడి సంతోషపడేవాళ్లం. నాటి ఆటలు నేటి పిల్లలకు అందకుండా పోతున్నాయి.

- బోగ సంజీవ, యాదగిరిగుట్ట

ఆనాటి ఆటలు నేటి తరానికి అందించాలి



ఆనాటి ఆటలను తల్లిదండ్రులు పిల్లలతో ఆడిస్తూ ఆటల గురించి వాటిని వివరించాలి. ఆటల సంస్కృతీ, సంప్రదాయాలు పిల్లలకు తెలియపర్చాలి. అలనాటి ఆటలు అంతరించకుండా భావితరాల వారికి అందించేలా ప్రతీ తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

- పేరబోయిన పెంటయ్య, కొత్తగుండ్లపల్లి

పిల్లలను స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంచాలి



చిన్ననాటి నుంచే పిల్లలకు స్మార్ట్‌ఫోన్లు ఇవ్వకుండా వారిని దూరంగా ఉంచాలి. ఫోన్లు ఇవ్వడంతో ఇతర ఆటలపై ఆసక్తి ఉండకుండా పోవడమే కాకుండా వారిలో అనారోగ్య సమస్యలు, కంటి సమస్యలు ఎక్కువగా తలత్తే ప్రమాదం ఉంది. వాటిని నివారించి అలనాటి ఆటలను ఆడించాల్సిన బాధ్యత తల్లిదండ్రులు, అందరిపై ఉంది.

- పేరబోయిన రేణుక, కొత్తగుండ్లపల్లి

ఆర్థిక ఇబ్బందులతో ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య



శ్రీనివాస్‌రావు(ఫైల్)

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపానికి గురై ప్రభుత్వ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో సోమవారం జరిగింది. ఎస్‌ఐ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం సాగర్ హిల్‌కాలనీకి చెందిన నెల్లం శ్రీనివాస్‌రావు(42) డిండిలో నీటిపారుదల శాఖ విభాగంలో పనిచేస్తున్నాడు. కొంతకాలంగా అనారోగ్యం, ఆర్థికసమస్యలతో ఇబ్బందులుపడుతున్నాడు. సోమవారం ఉదయం 11గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. బయటకు వెళ్లివచ్చిన భార్య విజయశ్రీ గమనించే సమయానికే మృతి చెందాడు. విజయశ్రీ ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. శ్రీనివాసరావుకు కుమార్తె, కుమారుడు ఉన్నారు.

అనారోగ్య సమస్యలతో యువతి



మౌనిక (ఫైల్)

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య సమస్యలతో యువతి ఆత్మహత్యకు పాల్పడింది. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం చౌటుప్పల్ పట్టణ కేంద్రం రాంనగర్‌కు చెందిన గుండ్ల మౌనిక(25) అవివాహితురాలు. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. మనస్తాపానికి గురైన మౌనిక ఇంట్లో ఎవరూ లేనిసమయంలో ఉరివేసుకుంది. తండ్రి రామచంద్రయ్య బయటికి వెళ్లి వచ్చేసరికి మౌనిక మృతి చెందింది. మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. తండ్రి రామచంద్రయ్య ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో ప్రైవేట్ ఉద్యోగి..



జనార్ధన్(ఫైల్)

పెన్‌పహాడ్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలంలో అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ గోపీకృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని సింగిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుణగంటి జనార్ధన్(37) హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నాడు. భార్య చంద్రకళతో పాటు ఇద్దరు కుమార్తెల ఉన్నారు. అప్పుడప్పుడు స్వగ్రామానికి వచ్చి వెళ్తుంటాడు. నేరేడుచర్ల మండలం చిల్లేపల్లి సమీపంలోని గుడుగుంట్లపాలెం వద్ద ఉన్న గురుకుల హాస్టల్‌లోని కుమార్తెను తీసుకురావడానికి చంద్రకళ వెళ్లింది. సాయంత్రం కుమార్తెతో కలిసి తిరిగి వచ్చే సరికి ఇంట్లో గుణగంటి జనార్ధన్(37) ఉరివేసుకుని కనిపించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో శవపంచనామా అనంతరం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం అనంతరం బంధువులకు అప్పగించారు. తనకు తెలియకుండా అప్పులు చేసి మనస్తాపంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భార్య చంద్రకళ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ గోపీకృష్ణ తెలిపారు.

మతిస్థిమితం లేని వ్యక్తి బావిలో పడి మృతి

కట్టంగూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : మానసిక స్థితి బాగోలేక ప్రమాదవశాత్తు బావిలో పడి ఒక వ్యక్తి మృతి చెందాడు. నల్లగొండ జిల్లా కట్టంగూరు ఎస్‌ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పరడ గ్రామానికి చెందిన కాసర్ల శ్రీనివాస్ రెడ్డి(47) కొంతకాలంగా మానసిక స్థితి బాగోలేక ఇబ్బందిపడుతున్నాడు. ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకువెళ్లాడు. రాత్రి వరకు రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. అయినా ఆచూకీ లభించలేదు. మండలంలోని ఈదులూరు గ్రామ శివారులోని మారబోయిన కలమ్మ వ్యవసాయ బావిలో గుర్తుతెలియని మృతదేహం నీళ్లపై తేలింది. స్థానికుల ద్వారా విషయాన్ని తెలుసుకున్న శ్రీనివాసరెడ్డి బంధువులు వెళ్లి మృతదేహాన్ని చూసి గుర్తించారు. శ్రీనివాసరెడ్డి భార్య విడాకులు తీసుకుని వెళ్లిందని తల్లి కాసర్ల యాదమ్మ పోలీసులకు తెలిపింది. యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. తన కుమారుడి మృతిపై ఎలాంటి అనుమానం లేదని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నాట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి ఒక కుమార్తె ఉన్నట్లు తెలిపారు.

10 తులాల బంగారం అపహరణ

మునుగోడు రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా మునుగోడు మండలం కచలాపురంలో భారీ చోరీ జరిగింది. సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ రవి తెలిపిన వివరాల ప్రకారం కచలాపురం గ్రామానికి చెందిన మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లో సోమవారం ఎవరూ లేని సమయంలో దొంగలు ఇంట్లోకి ప్రవేశించి బీరువాలోని 10తులాల బంగారం అపహరించారు. పనులు ముగించుకొని ఇంటికి వెళ్లే సరికి చోరి జరిగిందని గుర్తించారు. సమాచారం తెలుసుకున్న సీఐ ఆదిరెడ్డి, ఎస్‌ఐ రవి సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లుగా ఎస్‌ఐ తెలిపారు. బంగారం విలువ రూ.9 లక్షల వరకు ఉంటుందని బాధితుడు తెలిపారు.

గడ్డివాము దగ్ధం



వేములపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా వేములపల్లి మండలంలో గడ్డివాము దగ్ధమైంది. స్థానికులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం ఆమనగల్లు గ్రామానికి చెందిన బయ్య సైదులు పశువుల మేత కోసం ఎనిమిది ఎకరాల గడ్డిని గ్రామసమీపంలోని బండపైన గడ్డివాము వేశాడు. సోమవారం మధ్యాహ్నం ప్రమాదశాత్తు నిప్పంటుకొని దగ్ధమవుతుండగా గమనించిన స్థానికులు నీటిట్యాంకర్ సహాయంలో మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినప్పటికీ పూర్తిగా దగ్ధమైందన్నారు. సుమారు రూ.50వేల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు బయ్య సైదులు ఆవేదన వ్యక్తం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

భువనగిరి టౌన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరి ఖిల్లా వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. పట్టణ ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం ఆలేరుకు చెందిన కే శ్రీధర్‌చారి(21), భువనగిరికి చెందిన రంగాపురం నవదీప్ బైకులపై ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇరువురిని సికింద్రాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించగా శ్రీధర్‌చారి చికిత్సపొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ మేరకు శ్రీధర్‌చారి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

● కేతేపల్లి : సూర్యాపేట జిల్లా కేతేపల్లి మండలంలో హైదరాబాద్-విజయవాడ రహదారిపై రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన మేరకు సంఘటన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కందికంటి అశోక్ తన బైక్‌పై నకిరేకల్ వెళుతున్నాడు. బైక్ ఇనుపాముల శివారులోకి రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కకు వేగంగా దూసుకెళ్లి చెట్టుకు ఢీకొట్టింది. ఈ సంఘటనలో అశోక్ కాలు తెగి పూర్తిగా శరీరం నుంచి విడిపోయి దూరంగా పడిపోయింది. సంఘటనా సమాచారం అందుకున్న 108సర్వీసు సిబ్బంది క్షతగాత్రుడిని సూర్యాపేట జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

● వేంపాడులో ఎమ్మెల్సీ కోటిరెడ్డి డ్రైవర్...



నర్సింహ(ఫైల్)

నిడమనూరు, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవర్ మృతి చెందాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో సోమవారం జరిగింది. ఎస్‌ఐ ఉప్పు సురేష్ తెలిపిన వివరాల ప్రకారం నిడమనూరు మండలం ఎర్రబెల్లి గ్రామానికి చెందిన ఉప్పునూతల నర్సింహ(41) ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి వద్ద వ్యక్తిగత డ్రైవరుగా పనిచేస్తూ మిర్యాలగూడలోని బాపూజీనగర్‌లో నివాసం ఉంటున్నాడు. సోమవారం విధులు ముగించుకున్న నర్సింహ స్వగ్రామమైన ఎర్రబెల్లికి వెళ్లి పొలం పనులు చూసుకుని తిరిగి బైక్‌పై సాయంత్రం నాలుగు గంటల సమయంలో మిర్యాలగూడకు బయలుదేరాడు. నిడమనూరు మండలం వేంపాడ్ సమీపంలో అన్నారం స్టేజీ దగ్గర ఎదురుగా వస్తున్న గుర్తుతెలియని ఓ వాహనం ఢీకొనడంతో బైక్‌పై ఉన్న నర్సింహ కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. నర్సింహ మృతితో ఎర్రబెల్లి, పరిసర గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలివిడిగా ఉండే నర్సింహ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడన్న విషయం జీర్ణించుకోలేకపోతున్నారు. నర్సింహ మృతదేహం వద్ద కుటుంబసభ్యులు బోరున విలపించారు. నర్సింహకు భార్య రామేశ్వరి, ఇద్దరు కుమారులు ఈశ్వర్, అజయ్ ఉన్నారు. ఆస్పత్రిలో ఉన్న నర్సింహ మృతదేహాన్ని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు. నర్సింహ భార్య రామేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

● నూతనకల్ : సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం చిన్ననేమిల క్రాస్ రోడ్డు వద్ద సూర్యాపేట-జనగాం 365 జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఎస్‌ఐ మహేంద్రనాథ్ తెలిపిన వివరాల ప్రకారం మద్దిరాల మండలం మామిండ్లమడవ గ్రామానికి చెందిన షేక్ మల్సూర్ తన బైక్‌తో చిన్ననెమిల క్రాస్ రోడ్డుకు వచ్చాడు. జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాద్ నుంచి మరిపెడబంగ్లా వైపు వెళ్తున్న కారు అతి వేగంగా ఢీకొట్టింఇ. దీంతో గాలిలోకి ఎగిరి మల్సూర్ కిందపడడంతో అతడి తలకు బలమైన గాయాలయ్యాయి. కాలు వేళ్లు తెగిపడ్డాయి.

అతడిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేటకు తరలించారు. సంఘటనా స్థలాన్ని ఎస్‌ఐ మహేంద్రనాథ్ సందర్శించి, వివరాలు తెలుసుకున్నారు.

నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తాం



రైతు ఫిర్యాదుపై విచారణ చేస్తున్న ఏడీ రవి

నేరేడుచర్ల, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : రైతు ఫిర్యాదుపై పర్టిలైజర్ దుకాణ యజమానిని విచారించామని, రైతుతో మాట్లాడామని విచారణ నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఏడీఏ రవి అన్నారు. పురుగుల మందు పిచికారీ చేయడం వల్ల తాను నష్టపోయానని ఫర్టిలైజర్ దుకాణ నిర్వాహకులపై రైతు ఫిర్యాదు మేరకు సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలో సోమవారం వ్యవసాయాధికారులు విచారణ ప్రారంభించారు. నేరేడుచర్ల వ్యవసాయాధికారి కార్యాలయానికి ముకుందాపురం గ్రామ రైతు శ్రవణ్‌తో పాటు, లక్ష్మీవేంకటేశ్వర ఫర్టిలైజర్ డీలర్ ముదిరెడ్డి వెంకటరెడ్డిని పిలిపించి విచారణ చేపట్టారు. ఇరువురి వాదనలను ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు ఏడీఏ తెలిపారు. డీలర్ వెంకటరెడ్డి ఏ కంపెనీ సరఫరా చేసిన మందులు రైతుకు ఇచ్చింది వివరాలు సేకరించారు. కంపెనీపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతున్నట్లు తెలిపారు. రైతుకు తగిన న్యాయం చేస్తామని ఏడీఏ రవి తెలిపారు. ఆయన వెంట వ్యవసాయాధికారి జావిద్ ఉన్నారు.

ఏపీ నుంచి హైదరాబాద్‌కు ఇసుక

● మిర్యాలగూడ వద్ద పట్టుకున్న పోలీసులు



మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న లారీని నల్లగొండ జిల్లా మిర్యాలగూడ రూరల్ పోలీసులు సోమవారం సీజ్ చేశారు. ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కిష్టాపురం వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో ఓవర్‌లోడ్‌తో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్ వెళ్తున్న లారీని ఆపి లోడుకు సంబంధించిన పత్రాలను పరిశీలించగా ఎలాంటి అనుమతులు లేకుండా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బాపట్ల జిల్లా చిన్నగంజం నుంచి హైదరాబాద్‌కు ఇసుక అక్రమంగా తరలిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో టీఎస్ 05యూడీ1225 నెంబరుగల లారీ డ్రైవర్ బత్తుల రాజును అదుపులోకి తీసుకొని ప్రశ్నించారు. తనిఖీలో పట్టుబడ్డ లారీ నల్లగొండ పట్టణానికి చెందిన రాచకొండ నగేష్‌గౌడ్‌కు చెందినదిగా గుర్తించినట్లు రూరల్ ఎస్‌ఐ తెలిపారు. ఎలాంటి అనుమతి ప్రతాలు లేకుండా ఇసుక అక్రమరవాణాకు పాల్పడుతున్న లారీని సీజ్ చేసి డ్రైవర్ రాజుతోపాటు, సదరు వాహనం యజమాని నగేష్‌గౌడ్‌పై కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

పోలీసుల అదుపులో సిగరెట్ దొంగలముఠా?

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ బాలాజీ కిరాణ దుకాణంలో రూ.15లక్షల విలువైన సిగరెట్ల బాక్సులను ఎత్తుకెళ్లిన దొంగల ముఠాను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన ఐదుగురు దొంగల ముఠా సభ్యులను స్థానిక పోలీసులు స్వరాష్ట్రంలోని స్వగ్రామంలో పట్టుకున్నట్లు తెలుస్తోంది. దొంగలను అరెస్టు చేసి స్థానిక పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సిగరెట్టు బాక్సులను స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు మంగళవారం వెల్లడించే అవకాశం ఉంది.

దేవాలయంలో చోరీ

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి):యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం కుంట్లగూడెంలో పెద్దమ్మ తల్లి దేవాలయంలో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. అమ్మవారి మెడలోని తులంపావు బంగారు చైన్, పావుతులం ముక్కుపుడక, కిలో వెండి కిరీటం, అరకిలో వెండి ప్లేటు చోరీ చేశారు. ఈ మేరకు దేవాలయ అధ్యక్షులు నరేశ్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్లాట్ల కబ్జాపై ఫిర్యాదు

భువనగిరి (కలెక్టరేట్), ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): తమపేరున రిజిస్ట్రేషన్ చేసుకున్న భూమిని కబ్జా చేస్తున్నారని, న్యాయం చేయాలని ప్లాట్ల కొనుగోలుదారులు విజ్ఞప్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి ప్రైవేట్ బస్సులో యాదాద్రిభువనగిరి జిల్లా కలెక్టరేట్‌కు వచ్చారు. సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదుచేసి అదనపు కలెక్టర్‌కు ఆవేదనను వెళ్లబోసుకున్నారు. బాధితులు మాట్లాడుతూ 2011-12లో యాదగిరిగుట్ట మండలం కాచారం గ్రామ రెవెన్యూ పరిధిలోని మహదేవ్ ఎస్టేట్ వెంచరు సర్వేనంబరు 129, 130, 131లలో సత్యనారాయణరెడ్డి అనే వ్యక్తి 600 ప్లాటు చేశారని, వాటిలో పలుప్లాట్లు కొనుగోలు చేశామన్నారు. పూర్తిగా డబ్బులు చెల్లించడంతో రిజిస్ట్రేషన్ అయ్యిందన్నారు. పేరు మార్చుకోకపోవడంతో తిరిగి అతడి పేరునే రికార్డు వస్తుండటంతో ప్లాట్ల హద్దులను నిర్ధయించుకున్నామని, కానీ ఇటీవల కొందరు తమ హద్దులను తొలగించి కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విచారణ చేసి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో బాధితులు కుమారస్వామి, మోహిన్‌ఖాన్, శ్రీరంగం, భాగ్య, మీనాక్షి, పద్మజ, జ్యోతి, దేవేందర్, శోభారాణి శ్రీలత, పలువురు వృద్ధులు, మహిళలు ఉన్నారు.

శరవేగంగా విజయవిహార్ ఆధునికీకరణ

- ● రూ.5కోట్లతో పూర్తికి కసరత్తు
- ●సాగర్‌కు రానున్న 140 దేశాల మిస్‌వరల్డ్ పోటీ యువతులు, దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు



విజయవిహార్ భవనానికి రంగులు వేస్తున్న కూలీలు

నాగార్జునసాగర్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక కేంద్రం, అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ హిల్‌కాలనీలోని విజయవిహార్ అతిథి గృహంలో రూ.5 కోట్లతో చేపట్టిన ఆధునికీకరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తెలంగాణ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో మే 7వ తేదీ నుంచి 31వ తేదీ వరకు నిర్వహించే మిస్‌వరల్డ్ పోటీలకు 140 దేశాలకు చెందిన యువతులు, 3 వేల మంది దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు హాజరవుతున్నారు. వీరంతా రాష్ట్రంలో వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించనున్నారు. దీనిలో భాగంగా మే 12న నాగార్జునసాగర్‌కు వస్తున్నారు. సాగర్‌లో బుద్ధవనం, జలాశయం మధ్యలో ఉన్న నాగార్జునకొండను సందర్శిస్తారు. వీరు ఇక్కడ విడిది చేయడానికి వీవీపీ అతిథి గృహం అయిన విజయవిహార్‌ను ఎంపికచేశారు. మిస్‌వరల్డ్ పోటీలకు కేవలం నెల రోజులు మాత్రమే సమయం ఉండటంతో ఆధునికీకరణ పనులు శరవేగంగా చేస్తున్నారు. పనులను గత నెల 22న పర్యాటక శాఖ ఎండీ ప్రకాష్‌రెడ్డి, నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిలు పరిశీలించారు. విజయవిహార్‌లో సమీక్షా సమావేశం నిర్వహించి ప్రతిష్టను, తెలంగాణ సంస్కృతీ,సంప్రదాయాలను దేశ, విదేశాలకు తెలియపరిచేలా పర్యాటక ప్రాంతాలను తీర్చి దిద్దాలని పర్యాటక శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో విజయవిహార్‌లో ప్రస్తుతం స్విమ్మింగ్ పూల్, సరోవర్ విభాగంలో రంగులు అద్దె పనులు చకచక సాగుతున్నాయి. ప్రధాన విభాగంలో రిసెప్షన్‌పైన ఉన్న గదులకు చిప్పింగ్ చేయడం వంటి పనులు చేస్తున్నారు. అంతే కాకుండా డ్రైనేజీ నూతన లైన్లను ఏర్పాటు చేస్తున్నారు.



నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాల్వ

20 రోజుల్లో పనులు పూర్తి చేస్తాం

విజయవిహార్ అతిథి గృహం ఆదునికీకరణ పనులను 20 రోజుల్లో పూర్తి చేస్తాం. మిస్‌వరల్డ్ పోటీదారులు సాగర్ సందర్శనకు వచ్చే నాటికి అన్ని పనులు పూర్తి చేస్తాం. ఇప్పటికే సగం పనులు పూర్తయ్యాయి.

శ్రీనివాస్‌రెడ్డి, డీఈ, పర్యాటక శాఖ

ఎడ్ల పందేలకు పెరుగుతున్న ఆదరణ

తెలుగు రాష్ట్రాల స్థాయి ఎడ్ల పందేలు ప్రారంభించిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి



ఉమ్మడి రాష్ట్రస్థాయి ఎడ్ల పందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహించే జాతరలు, ఉత్సవాల్లో ఎడ్ల పందేలకు ఆదరణ పెరుగుతోందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. శ్రీరామనవమి సందర్భంగా నల్లగొండ జిల్లా తిరుమలగిరి(సాగర్) మండలకేంద్రంలో ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయి ఎద్దుల పందేల పోటీలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా శ్రీరామనవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో పండుగను నిర్వహించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా పందేల్లో పాల్గొనేందుకు ఆంధ్రప్రదేశ్‌లోని అమరావతి, పల్నాడు, కృష్ణా, తెలంగాణలోని నల్లగొండ, సూర్యాపేట జిల్లాలకు చెందిన ఎనిమిది ఎద్దుల జతలను సంబంధిత యజమానులు తీసుకొచ్చారు. పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, మార్కెట్ డైరెక్టర్ శాగం మంగమ్మ, ఏసీపీ చవ్వా శంకర్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, కాంగ్రెస్ నాయకుడు శాగం పెద్దిరెడ్డి, మాజీ ఎంపీపీ ఆంగోతు భగవాన్‌నాయక్, శ్రవణ్‌కుమార్‌రెడ్డి, గురునాథం, బద్దెల వెంకన్న, లాలునాయక్, భద్రినాయక్, చింతల చంద్రారెడ్డి పాల్గొన్నారు.

పొగాకు సాగు లాభాలు బాగు

పదేళ్లుగా సాగుచేస్తున్న రైతులు ● క్వింటా రూ.15వేలకు విక్రయం



తిమ్మాపురం వ్యవసాయ క్షేత్రంలోని షెడ్డులో ఆరబెట్టిన పొగాకు

అర్వపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రైతులు పొగాకు సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలంలోని తిమ్మాపురం, అడివెంల, కొమ్మాల, కోమటిపల్లి, కుంచమర్తి గ్రామాలకు చెందిన రైతులు 350 ఎకరాల్లో ఐటీసీ కంపెనీ సహకారంతో పొగాకు తోటలు సాగు చేస్తున్నారు. నీరు తక్కువగా ఉండడంతో రైతులు పొగాకు తోట వైపు మొగ్గు చూపుతున్నారు. తిమ్మాపురం గ్రామానికి చెందిన వేములకొండ వెంకన్న అనే రైతు పదేళ్లుగా, అదే గ్రామానికి చెందిన బొల్లం వెంకటేశ్వర్లు ఐదేళ్ల నుంచి ఐదు ఎకరాల్లో పొగాకు తోటలను సాగు చేస్తున్నారు. ఎకరానికి రూ.20వేలు పెట్టుబడులు పెడతారు. ఎక్కువ మొత్తంలో రసాయన మందులు వాడటం లేదు. పెట్టుబడి తక్కువగా ఉండి దిగుబడి ఎక్కువగా రావడంలో రైతులు తోటల వైపు మొగ్గు చూపారు. ఈ పంట 90రోజుల్లో చేతికి వస్తుంది. 15 రోజులకోసారి పొగాకు తోటకు నీరు పెట్టి సాగు చేస్తున్నారు. వ్యవసాయ క్షేత్రం వద్ద షెడ్డును ఏర్పాటు చేసి పొగాకు కోత కోసి పది రోజుల పాటు ఆరబెట్టి విక్రయిస్తారు. ఎకరానికి 12క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఐటీసీ కంపెనీ ప్రతినిధులు రైతులకు పొగాకు తోటపై సూచనలు, సలహాలు ఇచ్చి వ్యవసాయ క్షేత్రాల వద్దకు వచ్చి క్వింటాకు రూ.15,500 కొనుగోలు చేస్తున్నారు.

పొగాకు సాగుతో లాభాలు ఆర్జిస్తున్నాం



ఐదేళ్లుగా ఐదు ఎకరాల్లో పొగాకు సాగు చేస్తున్నాం. క్వింటాకు రూ.15,500 వస్తున్నాయి. కంపెనీ సూచనల మేరకు పొగాకు తోటలను సాగు చేస్తున్నాం. పెట్టుబడులు పోనూ లాభాలు ఆర్జిస్తున్నాం.

బొల్లం వెంకటేశ్వర్లు రైతు, తిమ్మాపురం గ్రామం, జాజిరెడ్డిగూడెం మండలం

కొత్త ఎమ్మెల్సీల ఉత్సాహం



ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసి బయటకు వస్తున్న నెల్లికంటి సత్యం

నల్లగొండ జిల్లా సీపీఐ కార్యదర్శి నెల్లికంటి సత్యం సోమవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైన అద్దంకి దయాకర్ కూడా ప్రమాణ స్వీకారం చేశారు. వారికి కాంగ్రెస్, సీపీఐ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



వ్యాధి తగ్గినా.. అప్పులు మిగిలాయి

● గత సంవత్సరం మార్చిలో వింత జ్వరాలతో ఇందుగుల అతలాకుతలం ● మూడు నెలల పాటు వైద్య శిబిరం ● గ్రామస్థుల బాధలు వెలుగులోకి తెచ్చిన 'ఆంధ్రజ్యోతి'



ఇందుగుల గ్రామం

మాడ్గులపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గత సంవత్సరం మార్చి నెలలో నెలకొన్న ప్రతికూల వాతావరణంతో అంతుచిక్కని రోగంతో ఆ ఊరంతా భయాందోళనకు గురైంది. సుమారు మూడు నెలల పాటు గ్రామస్థులు విష జ్వరాలు, ఒళ్లు నొప్పులతో తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేసినా ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వారి బాధ వర్ణనాతీతంగా ఉండేవి. గ్రామంలోని ప్రతి కుటుంబంలోనూ ఇద్దరికి చొప్పున జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడ్డారు. గ్రామంలో సుమారు రెండు వేలకు పైగా జనాభా ఉండగా గ్రామంలో జ్వరాలతో బాధపడుతుంటే వైద్యాధికారులు మాత్రం నామమాత్రంగా పరీక్షలు నిర్వహించి చేతులు దులుపుకున్నారు. గ్రామస్థుల బాధలపై 'వ్యాధి దొరకక.. చికిత్సకు లొంగక' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పందించారు. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారులను అప్రమత్తం చేశారు. దీంతో అధికారులు గ్రామంలో కొన్ని రోజులపాటు వైద్య శిబిరాలు నిర్వహించి మందులను అందజేశారు. హైదరాబాద్ నుంచి జోనల్ అధికారులు, వరంగల్ నుంచి రాష్ట్ర మలేరియా నియంత్రణ అధికారులు వచ్చి సుమారు 400 మంది నుంచి రక్త నమూనాలను సేకరించారు. గ్రామంలోని నీటి నమూనాలను తీసుకొని ల్యాబ్‌కు పంపించగా రక్త నమూనాలో ఎలాంటి వ్యాధి లక్షణాలు లేవని నిర్ధారించారు.

ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి..

గ్రామంలో ఎక్కువ మంది బాధితులు మిర్యాలగూడ, నల్లగొండ పట్టణాలకు వెళ్లి ప్రైవేట్ ఆసుపత్రుల్లో పరీక్షలు చేయించుకోవడంతో నెగిటివ్‌గా రిపోర్ట్స్ వచ్చినా వ్యాధి మాత్రం తగ్గలేదు. దీంతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు అంతుచిక్కని వ్యాధి వ్యాపించడంతో గ్రామస్థులు అయోమయానికి గురయ్యారు. కీళ్ల నొప్పులతోపాటు శరీరం నల్లగా మారడం వంటి లక్షణాలు ఎక్కువగా కనిపించడంతో మందులు వాడినంత వరకు వ్యాధి తగ్గినా ఆ తర్వాత తిరిగి వ్యాపించిందని అప్పటి గురించి గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దీంతో తమ వద్ద ఉన్న డబ్బులు ఖర్చు కాగా అప్పులు తెచ్చి మరీ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ఒక్కో రోగికి సుమారు రూ.20వేల నుంచి రూ. 25వేల వరకు ఖర్చయింది. వ్యాధి తగ్గినా అప్పులు మాత్రం ఇప్పటికీ తీర్చలేకపోయామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలని వైద్యుల సూచన

గ్రామంలో విస్తృతంగా జ్వరాలు వ్యాపించడంతో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువగా దోమలు ఉండడంతో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు అన్నారు. గతేడాది తమకు వ్యాపించిన అంతుచిక్కిన వ్యాధితో ఇప్పటికీ గ్రామంలో ఎవరిని కదలించినా 'వామ్మో ఆ నొప్పులా' అని తలుచుకొని ఇప్పటికీ భయపడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి అలజడి లేదని, ప్రస్తుతం గ్రామస్థులు ఆరోగ్యంగా ఉన్నారని, ఇబ్బందులు ఉంటే వెంటనే తమను సంప్రదించాలని వైద్యులు పేర్కొంటున్నారు.

కొద్దిగా నొప్పులు ఉన్నాయి



గత సంవత్సరం నాకు జ్వరం వచ్చింది. మూడు నెలల పాటు బాధను అనుభవించా. దీంతో నేను ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నా. జ్వరం తగ్గిన తర్వాత కూడా కీళ్ల నొప్పులు, వాపులు మొదలయ్యాయి. ముఖంపై నల్లటి మచ్చలు వచ్చా యి. మళ్లీ వైద్యం చేయించుకోవడంతో రూ.25వేలు ఖర్చు అయ్యాయి. తిరిగి ఇప్పుడు మళ్లీ నొప్పులు కొద్దిగా మోకాళ్ల నొప్పి వస్తుంది. మందులు వాడుతున్నా.

దాసరి సైదులు, ఇందుగుల

ప్రస్తుతం ఎలాంటి జ్వరాలు లేవు



ఇందుగులలో గత ఏడాది మార్చిలో వైద్య శిబిరం నిర్వహించాం. రాష్ట్ర, జిల్లా వైద్యాధికారుల సూచనల మేరకు గ్రామంలో పర్యటించి ఇంటింటికీ తిరిగి జ్వరం, ఒళ్లు నొప్పులతో బాధపడిన వారికి మందులు పంపిణీ చేశాం. ప్రస్తుతం గ్రామంలో ఎలాంటి జ్వరం, ఒళ్లు నొప్పుల వంటి వారు ఎవరూ లేరు. ఏదైనా సమస్య ఉంటే తమను వెంటనే సంప్రదించాలి.

● ఫిర్దోస్, మెడికల్ ఆఫీసర్, ఇందుగుల

నేత్రపర్వంగా రాములోరి పట్టాభిషేకం

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో రాములోరి పట్టాభిషేకం సోమవారం వైభవంగా నిర్వహించారు. నిత్యారాధనల అనంతరం తిరువీధిసేవ చేపట్టి మూలమంత్ర జపాలు, దశశాంతి, పంచసూక్త పారాయణాలతో అభిషేకాలు, ఆధ్యాత్మ రామాయణ పారాయణం అష్టోత్తర శతనామార్చనలు నిర్వహించారు. పట్టాభిషేకం మహోత్సవ విశిష్టతను ఆలయ సిద్ధాంతి గౌరిభట్ల సత్యనారాయణశర్మ, ప్రధాన పూజారి నరసింహమూర్తి భక్తులకు వివరించారు. అర్చకుల వేద మంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య అభిషేక మండపంలోని సువర్ణ కలశాలలో నింపి స్వర్ణ సింహాసనంపై అధిష్ఠింపజేసి పట్టాభిషేక మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం ఆలయంలోని యాగశాలలో సహస్రనామార్చనలు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వితరణ జరిపారు. వేడుకల్లో ఆలయ అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తి, ఈవో ఏపూరి భాస్కర్‌రావు, ఉప కార్యనిర్వాహణ అధికారి దోర్బల భాస్కరశర్మ, ఏఈ వోలు ప్రతాప నవీన్‌కుమార్‌శర్మ, గజ్వేల్లి రమేష్‌బాబు, రఘు, పర్యవేక్షకులు నాగుల మహేష్, రామరావునాయక్ తదితరులు పాల్గొన్నారు.

శివకేశవులకు విశేష పూజలు

శివకేశవులకు విశేష పూజలు కొనసాగాయి. స్వయంభు స్వామిఅమ్మవారికి శ్రీవైష్ణవ పాంచరాత్రాగమరీతిలో, పర్వతవర్థిని రామలింగేశ్వరస్వామి శివాలయంలో స్ఫటికమూర్తులకు శైవాగమశాస్త్రరీతిలో నిత్య కైంకర్యాలు నిర్వహించారు. ప్రధానాలయంలో సుప్రభాత సేవతో స్వామిఅమ్మవారిని మేల్కొలిపిన అర్చకులు మూలమూర్తులను వేదమంత్ర పఠనాలు, పంచామృతాలతో అభిషేకించి, తులసీ దళాలతో అర్చించారు. అష్టభుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను దివ్యమనోహరంగా అలంకరించి విశ్వక్సేనుడికి తొలి పూజలు చేపట్టి సుదర్శన హోమం, నిత్య కల్యాణోత్సవం నిర్వహించారు. శివాలయంలోని ముఖమండపంలో స్ఫటికమూర్తులను అర్చకులు వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల మధ్య పంచామృతాలతో అభిషేకించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.19,44,856ల ఆదాయం సమకూరినట్లు ఈవో భాస్కర్‌రావు తెలిపారు.



హారతి సమర్పిస్తున్న అర్చకుడు



మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనృసింహుడి ఆలయంలో భక్తవత్సలుడి కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వయంభువునికి పంచామృతాలతో పంచసూక్త విధానంగా అభిషేకాలు చేపట్టారు. ఉదయం యాగశాలలో సుదర్శన నారసింహ హోమాలు జరిగాయి. ఉత్సవ మూర్తులను ఆలయ ప్రదక్షిణ చేయించారు. కార్యక్రమంలో ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈవో సిరికొండ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సాగర్ సమాచారం

పూర్తిస్థాయి నీటి మట్టం	590.00 అడుగులు
టీఎంసీలు	312.0450
ప్రస్తుత నీటి మట్టం	516.30
టీఎంసీలు	142.6157
ఎడమకాల్వకు నీటి విడుదల	4,881
కుడికాల్వకు	2,053
విద్యుత్ కేంద్రం ద్వారా	నిల్
క్రస్ట్ గేట్ల ద్వారా	నిల్
ఎస్‌ఎల్‌బీసీ ద్వారా	1,800 క్యూసెక్కులు
వరద కాల్వ ద్వారా	300 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	నిల్
అవుట్‌ఫ్లో	8,734

పులిచింతల ప్రాజెక్టు

పూర్తిస్థాయి నీటి నిల్వ	45.77 టీఎంసీలు
ప్రస్తుత నీటి నిల్వ	33.88 టీఎంసీలు
పులిచింతలకు నీటి రాక	800 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	300 క్యూసెక్కులు
ఎన్ని గేట్ల ద్వారా	నిల్

మూసీ నీటిమట్టం

పూర్తిస్థాయి నీటి మట్టం	645 అడుగులు
టీఎంసీలు	4.46
ప్రస్తుత నీటి మట్టం	624.40 అడుగులు
టీఎంసీలు	0.76
కాల్వలకు విడుదల	26.19 క్యూసెక్కులు
ఇన్‌ఫ్లో	620.94 క్యూసెక్కులు
అవుట్‌ఫ్లో	55.09క్యూసెక్కులు

కంపచెట్లు పెరిగి.. రక్షణ గోడలు లేక

● పూర్తిస్థాయిలో మరమ్మతులకు నోచని ఏఎమ్మార్పీ ప్రాజెక్టు ● మొక్కుబడిగా కంపచెట్లు తొలగింపు ● మరమ్మతులు పూర్తయ్యేదెన్నడో?

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జంటనగరాలకు, ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగు, తాగునీరు అందించే ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు మరమ్మతులు పూర్తిస్థాయిలో జరగడంలేదు. గతంలో రక్షణ గోడ కుంగడంతో మోటర్లను ఆపివేసి ఇసుక బస్తాలు వేసి నీరులీకేజీ కాకుండా చేశారు. పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని అధికారులు ఆదేశించినా ముందుకు సాగడం లేదు. నాగార్జునసాగర్ నీటిమట్టం ప్రస్తుతం 516అడుగులు ఉంది. 510అడుగులకు దిగువకు చేరితే అవసరమైన నీటిని మోటర్ల ద్వారా ఎత్తిపోసి హైదరాబాద్ జంట నగరాలతో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు తాగునీరు అందించడానికి హైదరాబాద్ మెట్రో వాటర్ బోర్డు చర్యలు చేపట్టనుంది. నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలం పుట్టంగండి జీరో పాయింట్ వద్ద 2024లో రూ.3కోట్లతో పనులు చేపట్టి 600 హెచ్‌పీ సామర్థ్యం గల ఐదు మోటర్లు, 300 హెచ్‌పీ సామర్థ్యం గల మరో ఐదు మోటర్లు ఏర్పాటు చేశారు. వీటి ద్వారా సాగర్ బ్యాక్ వాటర్ నుంచి రోజుకు 900క్యూసెక్కుల నీటిని పుట్టగండి అప్రోచ్ కెనాల్‌లోకి ఎత్తిపోశారు. ప్రస్తుతం సాగర్ నీటిమట్టం 516అడుగులు ఉందని ఇప్పటివరకు ఇబ్బంది లేదని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. 2016, 2017, 2018, 2019, 2024లో వరుసగా మోటర్ల ఏర్పాటు చేసి సాగర్ నీటి మట్టం 500అడుగుల వరకు ఉన్నా నీటిని ఎత్తిపోశారు. కొన్ని సందర్భాల్లో మోటర్లకు నీరు అందకపోవడంతో నదిలో కాల్వ తవ్వి నీటిని పుట్టగండి మోటర్లకు అందించారు. ప్రస్తుతం నాలుగు మోటర్ల ద్వారా 1800 క్యూసెక్కుల నీటిని అక్కంపల్లి రిజర్వాయర్ తరలిస్తున్నారు. అక్కడి నుంచి జంటనగరాలకు 525 కూసెక్కులు, మిషన్‌భగీరథ 45 క్యూసెక్కుల నీటిని, పానగల్ రిజర్వాయర్‌కు 1100క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

రూ.9 కోట్లతో ప్రతిపాదనలు

పుట్టంగండి పంప్‌హౌస్, అక్కంపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ చుట్టూ కంపచెట్లు ఏపుగా పెరిగి నీరు లీక్ అవడంతో గత సంవత్సరం రూ.9కోట్లతో కంపచెట్లను తొలగించారు. ఇంకా పూర్తిస్థాయిలో పనులు పూర్తికాలేదు. గత సంవత్సరం మొదటి యూనిట్ మరమ్మతులకు గురికావడలో రూ.1.5కోట్లతో మరమ్మతులు చేపట్టారు. గత సంవత్సరం నిర్వహణ కోసం జెన్‌కో అధికారులు రూ.8.84 కోట్లతో ప్రతిపాదనలు చేయగా అది మార్చితో ముగిసింది. 2025-2026 సంవత్సరానికి నిర్వహణ కోసం రూ. రూ.9 కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు అధికారులు తెలిపారు.



చేయాల్సిన పనులు

గతంలో పుట్టంగండి నుంచి అక్కంపల్లి రిజర్వాయర్ వరకు 12 కిలోమీటర్ల దూరం కెనాల్‌కు లైనింగ్ మురమ్మతుల కోసం రూ.51 కోట్లు ప్రతిపాదనలు పంపగా ప్రభుత్వం నుంచి ఇంకా అనుమతి రాలేదు. దీంతో పనులు ఇంకా ప్రారంభించలేదు. అలాగే ప్రధాన కాల్వలకు ఉన్న లింక్ కెనాల్‌లు కంపచెట్లతో నిండి ఉన్నాయి. దీంతో ఆయకట్టు చివరి వరకు నీరు చేరక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కాల్వల్లో పిచ్చి మొక్కలు తొలగించాల్సి ఉంది. అలాగే కాల్వల లైనింగ్ మరమ్మతులు చేయాల్సి ఉంది. అదే విధంగా పూర్తిస్థాయిలో రక్షణ గోడలు నిర్మించాల్సి ఉంది.

పెంపకందారులకు పరిహారం ఇవ్వాలి

భువనగిరి రూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెల, మేకల పెంపకం దారుల యజమానులకు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని గొర్రెల మేకల పెంపకం దారుల సంఘం (జీఎంపీఎస్) యాదాద్రిభువనగిరి జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి ఎంపీడీవో కార్యాలయం ఎదుట జీఎంపీఎస్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మూగ జీవాలకు గ్రామాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ భూముల్లో తుమ్మ చెట్లను ఉచితంగా మేపుకోవడానికి అవకాశం ఇవ్వాలని పెంపకం దారుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీధర్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు పాక జహంగీర్, మద్దిపురం బాలనర్సింహ, రాజలింగం, బాలేశ్వర్, అశోక్, యాదగిరి, కృష్ణ పాల్గొన్నారు.

వేసవిలోనూ కోనేరుకు జలకళ



దేవరకొండ ఖిల్లాపై ఉన్న కోనేరులో నిండుగా ఉన్న నీరు

దేవరకొండ ఖిల్లాతోపాటు కోనేరుకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వేసవి, కరువు పరిస్థితుల్లోనూ కోనేరు ఎండిన సందర్భాలు లేవు. 13వ శతాబ్ధంలో రేచర్ల పద్మనాయక వెలమరాజులు దేవరకొండ దుర్గాన్ని రాజధానిగా చేసుకొని 1326 నుంచి 1475 వరకు 149 సంవత్సరాలు పాలించారు. 770 సంవత్సరాలకు పూర్వం ఏడు కొండలు కలుపుతూ దేవరకొండ దుర్గాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ఎంతటి కరువు వచ్చినా కోనేరు ఎండిన సందర్భాలు లేవు. కొబ్బరినీటిని తలపించే విధంగా కోనేరు నీరు ఉండడంతో ఖిల్లాను సందర్శించడానికి వస్తున్న విదేశీయులు, పర్యాటకులు, భక్తులు, గొర్రెల కాపర్లు ఖిల్లాలోని కోనేరు నీటిని తాగుతారు. కోనేరుకు ఎక్కడి నుంచి నీరు వస్తుందో ఇప్పటికీ అంతుచిక్కని రహస్యం.

● దేవరకొండ, ఆంధ్రజ్యోతి

బతుకు పోరాటం







మనుషులకైనా, జీవులకైనా బతుకు పోరాటం తప్పదు. తమను తాము కాపాడుకునే సమయంలో ఎంతటి బలవంతుడినైనా ఎదిరించే ధైర్యం వస్తుంది. శక్తినంతా కూడగట్టి పోరాడేందుకు సిద్ధమవుతారు. ఇలాంటి దృశ్యమే నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని కతాల్‌గూడెం గ్రామంలో సోమవారం 'ఆంధ్రజ్యోతి' కెమెరాకు చిక్కింది. గాయపడిన ఓ ఎలుకను ఎత్తుకెళ్లేందుకు ప్రయత్నించిన రెండు కాకులతో ఓ ఎలుక శివంగిలా పోరాడింది. ప్రత్యర్థి తనకన్నా శక్తివంతులని తెలిసినా తన సహచర ఎలుకను హత్తుకొని కాకుల బారిన పడకుండా ధైర్యంగా ఎదుర్కొంది. కాకులను దగ్గరకు రానివ్వకుండా పోరాడింది.

- ఆంధ్రజ్యోతి, స్టాఫ్ ఫొటో గ్రాఫర్ నల్లగొండ.







ఆంధ్రజ్యోతి ****
నల్లగొండ
నకిరేకల్, మునుగోడు

విద్యార్థినికి సైకిల్ బహూకరణ

చిట్యాల రూరల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఏపూరు ప్రాథమిక పాఠశాల విద్యార్థిని ఎండీ. ఆసియాకు అదే గ్రామానికి చెందిన గుమ్మి నర్సిరెడ్డి, రంగారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం సైకిల్‌ను బహూకరించారు. చిన్నబక్కారెడ్డి సతీమణి జంగమ్మ సంస్మరణార్థం ఈ సైకిల్‌ను పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థినికి అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం గరిసె అంజయ్య, పంచాయతీ కార్యదర్శి మల్లేశం, గ్రామస్థులు లింగస్వామి, పద్మలింగస్వామి, వెంకటేశం, టీచర్లు పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో ప్రధాని మోదీ చిత్రపటాన్ని పెట్టాలి

శాలిగౌరారం, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): రేషన్‌షాపుల్లో ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటాన్ని పెట్టాలని బీజేపీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు జమ్ము రమేష్ డిమాండ్ చేశారు. శాలిగౌరారంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసలు సన్నబియ్యం ఇచ్చేది కేంద్ర ప్రభుత్వమేనని, మేమే సన్నబియ్యం ఇస్తున్నామని కాంగ్రెస్ పార్టీ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. రేషన్‌బియ్యానికి కేంద్ర ప్రభుత్వం రూ.10వేల కోట్లు కేటాయిస్తే రాష్ట్ర ప్రభుత్వం రూ.2వేల కోట్లు మాత్రమే కేటాయిస్తుందన్నారు.

యువత సన్మార్గంలో నడవాలి

సాయిప్రశాంత్, ఎస్ఐ, తిప్పర్తి



ఇంటర్వ్యూ Interview

యువత సన్మార్గంలో నడవాలని ఎస్ఐ సాయి ప్రశాంత్ అన్నారు. యువతతో సమాజాన్ని బాగు చేయవచ్చనే ఆలోచనలో పోలీస్ వ్యవస్థ ఉందని ఆయన పేర్కొన్నారు. యువతేజం ప్రోగాంతో యువతలో చాలా మార్పులు వచ్చినట్లు తెలిపారు.

(తిప్పర్తి, ఆంధ్రజ్యోతి)

ఆంధ్రజ్యోతి: యువతేజం అనే కార్యక్రమంతో మండలంలోని యువతలో ఎంత మార్పు వచ్చింది.

ఎస్ఐ: యువతేజం ప్రోగాం ద్వారా అన్ని గ్రామాల్లో యువతలో చాలా మార్పులు వచ్చాయి. యువత మత్తుకు అలవాటుపడి వారికి తెలియకుండానే తప్పులు చేస్తున్నారు. తర్వాత జీవితం చెడిపోయిందనే బాధతో కుమిలిపోతున్నారు. ఇలాంటి వారికి మేము సరైన విధంగా సలహాలు ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: యువత చెప్పితే వినే స్టేజిలో ఉందా?

ఎస్ఐ: యువత వినే పరిస్థితిలో ఉంది. ఎక్కువగా యువతకు క్రీడలపై ఆసక్తి ఎక్కువ. అలాంటి వారికి యువతేజం ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించి వారికి ఉన్న ప్రతిభను గుర్తించాం. ప్రతి గ్రామంలో యువతేజం వాట్సప్ యాప్ ద్వారా ఎప్పటికి అప్పుడు సరైన సలహాలు ఇస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: మత్తుకు బానిసలవుతున్న యువతను మార్చే అవకాశం ఉందా?

ఎస్ఐ: తప్పకుండా ఉంటుంది. ఈ మధ్యలోని మండలంలోని కేశరాజుపల్లి గ్రామంతో పాటు పలు గ్రామాల్లో గంజాయికి అలవాటు పడిన యువతను గుర్తించాం. ఆ మత్తులో ఏదైనా తప్పు చేస్తే ఎన్ని సమస్యలు వస్తాయనే విషయాన్ని వారిని పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చాం.

ఆంధ్రజ్యోతి: జాబ్‌మేళాలో ఎంతమంది ఎంపికయ్యారు?

ఎస్ఐ: నేటియువత చిన్న చిన్న జాబ్‌ల కోసం గుర్తు తెలియని వ్యక్తులకు డబ్బులు ఇచ్చి మోసపోతున్నారు. ప్రస్తుతం పోలీస్ ఆధ్వర్యంలో జరుగుతున్న జాబ్‌మేళాలో మండలంలోని 15 మందికి పైగా ఒకే రోజులో జాబ్ ఆఫర్ లెటర్లు తీసుకున్నారు. మరో 10 మందికి పైగా జాబ్‌లు వెరిఫికేషన్‌లో ఉన్నాయి.

ఆంధ్రజ్యోతి: మండలంలో ఏ సమస్యలు ఎక్కువగా ఉన్నాయి

ఎస్ఐ: మండలంలో ప్రస్తుతం ఎలాంటి సమస్యలు లేవు. ప్రతీ గ్రామంలో 15మందికి పైగా యువత నిత్యం పోలీస్‌కి మద్దతుగా ఉంటున్నారు. దీనివల్ల గ్రామంలో జరిగే సమస్యలను ముందుగానే తెలుసుకోగలుగుతున్నాం. అదే విధంగా ప్రతీ గ్రామానికి గతంలో మాదిరిగా ఒక పోలీస్‌ను నియమించాం. యువకుల సపోర్ట్‌తో జరగబోయే ప్రమాదాలను పసిగట్టి నివారిస్తున్నాం.

పాలన పరేషాన్!

- భారం మోసేదెవరు?
- నిధుల లేమి, పని ఒత్తిడి
- పంచాయతీ కార్యదర్శులపై పెనుభారం
- పరిపాలనా భారం మోస్తున్న సెక్రటరీలు



గ్రామ పంచాయతీ ఎదుట నిలిపిన ట్రాక్టర్

తిప్పర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామ పరిపాలనలో పంచాయతీ కార్యదర్శులపై పెనుభారం పడుతోంది. సర్పంచ్ పదవీకాలం పూర్తయి ఏడాది దాటినా ప్రత్యేక అధికారి, సెక్రటరీల సారథ్యంలో పరిపాలనా వ్యవస్థ కొనసాగుతుంది. ఈ తరుణంలో వచ్చే ప్రతీ ఖర్చును కూడా పంచాయతీ కార్యదర్శులే భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం నుండి ఏడాది కాలంగా ఎలాంటి నిధులు రాకపోవడంతో గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. అభివృద్ధి కార్యక్రమాల పేరుతో రాజకీయ నాయకులు ఎన్ని ప్రగల్భాలు పలికినా ఆచరణలో మాత్రం సాధ్యం కావడం లేదు. గ్రామ పంచాయతీల్లో నిధుల రాక, చేయాల్సిన పనులు చేయలేక మానసిక ఒత్తిడికి లోనవుతున్నారు కార్యదర్శులు. అదిగో ఎన్నికలు ఇదిగో ఎన్నికలు అంటూ నెలలు గడుస్తున్నా అభివృద్ధి పనులు, గ్రామ మౌలిక వసతుల కల్పనలో కార్యదర్శులు ఆర్థిక సమస్యలతో విఫలమవుతూనే ఉన్నారు. తిప్పర్తి మండల పరిధిలో మొత్తం 26 గ్రామ పంచాయతీలు ఉండగా పలు గ్రామ పంచాయతీల్లో కనీసం ట్రాక్టర్లను పంచాయతీ నుంచి బయటకు కూడా తీయలేకపోతున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలు మినహాయిస్తే రోజువారీగా చేయాల్సిన పారిశుధ్య పనులు కూడా చేయలేకపోతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడి చెత్త అక్కడే ఉండిపోతుంది.

మొదటి ఆరు మాసాలు మాజీలతోనే...

సర్పంచ్ పదవీకాలం పూర్తయిన మొదటి ఆరు మాసాల వరకు మాజీ సర్పంచ్‌లే కొంత మేర ఆర్థికంగా ఖర్చులు చేసి పంచాయతీకి కొంతమేర సాయం అందించారు. వారు పెట్టిన బిల్లులు రాకపోవడంతో ప్రస్తుతం వారు కూడా పంచాయతీ భవనానికి రావడం మానేశారు. వేసవికాలం సమీపిస్తుండటంతో రానున్న రోజుల్లో వాడే నీటితో పాటు తాగునీటికి ఇక్కట్లు వచ్చే అవకాశాలు రాకపోలేదు. గతేడాది పలు గ్రామాల్లో నీటి అవసరాల మేరకు పలువురు రైతుల వద్ద నుంచి ఒక్కో మోటార్‌కు నెలకు రూ.8వేల చొప్పున అద్దెకు తీసుకొని గ్రామానికి వాడుక నీరు అందించారు. కానీ వారికి చెల్లించాల్సిన సదరు మొత్తాన్ని ఇప్పటి వరకు వారికి ఇవ్వలేదు. దీంతో ఆయా రైతులు ఈ ఏడాది తమ బోరు ఇవ్వబోమని తేల్చి చెబుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 8లక్షల మేర అద్దె మోటార్లకు డబ్బులు ఇవ్వాల్సి ఉన్నట్లు సమాచారం. గత 14 నెలలుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి గ్రామ పంచాయతీలకు రావాల్సిన బిల్లులు రాకపోవడం వలన గ్రామంలో అభివృద్ధి పనులు చేయించడం కార్యదర్శులకు కత్తిమీద సాములా మారింది.

పంచాయతీ ఎన్నికలు త్వరగా నిర్వహించాలి



గ్రామ పంచాయతీ ఎన్నికలు త్వరగా నిర్వహించి సర్పంచులకు బాధ్యతలు ఇస్తే తప్ప గ్రామాల్లో పూర్తి స్థాయిలో పనులు జరగవు. పంచాయతీ కార్యదర్శులు కొన్ని చోట్ల చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారులను పట్టించుకోవడం లేదు. అధికారులు చొరవ తీసుకొని గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచాలి.

- పోలెబోయిన కిరణ్‌కుమార్, జంగారెడ్డిగూడెం

ట్రాక్టర్లు నడపలేని పరిస్థితిలో పంచాయతీలు

గత ప్రభుత్వం హయాంలో ప్రతీ గ్రామానికి ఒక ట్రాక్టర్‌ను ఏర్పాటు చేసి గ్రామంలో పల్లె ప్రగతి పేరుతో ప్రతీరోజు చెత్తను సేకరించి డంపింగ్ యార్డుకు తరలించేవారు. ఈ క్రమంలో గ్రామ పంచాయతీల్లో నిధులు ఉన్నన్ని రోజులు ఏ సమస్యలు రాలేదు. కానీ నిధులు ఎటునుంచి రాకపోవడంతో గ్రామంలో చెత్త సేకరించడం కూడా చిన్న గ్రామపంచాయతీల్లో భారంగా మారిందని పలు గ్రామాల సెక్రటరీలు వాపోతున్నారు. దీంతో స్థానికులు తమ ఇళ్లల్లోని చెత్తను గ్రామ శివారులోనే డంప్ చేస్తున్నారు. దీంతో గ్రామాలు దుర్భరంగా తయారవుతున్నాయి. కనీసం పంచాయతీలో మౌలిక వసతులు కల్పించని పరిస్థితిలో ప్రభుత్వాలు ఉంటే గ్రామాల్లోని ప్రజలు అనారోగ్యాల బారిన పడక తప్పదని పలువురు అభిప్రాయ పడుతున్నారు.



పేరుకుపోయిన చెత్తాచెదారం

వైభవంగా సీతారాముల కల్యాణం

శాలిగౌరారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం ప్రాజెక్టు సమీపంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్తలు శేషం రత్నమాచార్యులు, శేషం రామచంద్రాచార్యులు, రఘునందనాచార్యులు, శ్రీకాంతచార్యుల వేద పండితుల సారథ్యంలో స్వామివారి కల్యాణాన్ని కన్నుల పండువగా జరిగింది. అంతకు ముందు స్వామివారి ఎదుర్కోలు ఉత్సవం శేషం నర్సింహాచార్యులు, జగన్‌మోహనాచార్యుల ఆధ్వర్యంలో జరిగింది. వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కార్యక్రమంలో చాడ హతీష్ రెడ్డి, చామల వెంకటరమణారెడ్డి, చామల మహేందర్ రెడ్డి గ్రామస్థులు పాల్గొన్నారు.

చెరువులో తవ్వకాలు అడ్డుకున్న అధికారులు

నార్కట్‌పల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ రైతు మట్టి తవ్వుతున్న సమాచారం తెలుసుకున్న ఐబీ అధికారులు వెళ్లి అడ్డుకున్నారు. మండలంలోని అక్కెనపల్లి పెద్ద చెరువులో సోమవారం ఈ ఘటన జరిగింది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఓ రైతుకు చెందిన పట్టా భూమి ఉంది. దీంతో చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలోకి వచ్చే భూమిలోనే మట్టిని తవ్వి ఆ మట్టితో ఎత్తు పెంచే పనులు చేపట్టాడు. విషయం తెలుసుకున్న నీటి పారుదల శాఖ ఏఈ ఆంజనేయులు చెరువు వద్దకు వెళ్లి సందర్శించారు. మట్టి తవ్వుతున్న భూమి పట్టాభూమే అయినా కేవలం సాగు చేసుకోవాలే తప్ప ఇతర పనులు చేపట్టవద్దని హెచ్చరించారు. తవ్విన మట్టిని కూడా రైతు ద్వారానే పూడ్చి వేయించారు.

యువత తల్లిదండ్రులపై ఆధారపడవద్దు



భూమి దస్త్రావేజు పత్రాన్ని పంచాయతీ కార్యదర్శికి అందజేస్తున్న చొక్కారావు

తిప్పర్తి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): యువత తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులపై ఎక్కువగా ఆధారపడకుండా స్వయం కృషితో ముందుకు వెళ్లాలని డ్వాబ్ ప్రధాన కార్యదర్శి, రిటైర్డ్ హెచ్ఎం పొనుగోటి చొక్కారావు అన్నారు. తన స్వగ్రామమైన తిప్పర్తి మండల పరిధిలోని వెంకటాద్రిపాలెంలో సోమవారం తన పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన సుమారు 6 లక్షల విలువైన భూమిని తమ గ్రామపంచాయతీ భవన నిర్మాణం కోసం భూమి పత్రాన్ని, ఇంటి తాళాన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శి ప్రసన్నలక్ష్మికి అందజేశారు. తన కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సిన ఆస్తి ఇచ్చిన తర్వాత కూడా కుటుంబంలో సమస్యలు సృష్టిస్తున్నందున ఈ ఆస్తిని గ్రామస్థులకు ఉపయోగపడేలా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఆయన వెంట కార్యదర్శితో పాటు పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

రామలింగేశ్వరా... అక్రమాలు కనవా...?

(5వ పేజీ తరువాయి)

భాగస్వామ్యమైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, అనధికార వ్యక్తులను ఆలయవ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్డీవో నివేదికను వేగవంతంగా తెప్పించడంతోపాటు, మొత్తం ఆలయ నిర్వహణ, ఆదాయ, వ్యయాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని, ఆలయంలో అక్రమాల నిరోధానికి ప్రక్షాళన చర్యలు చేపట్టాలనే డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది.

బకాయిలు వసూలు చేయలేకపోవడం వెనుక అదృశ్య హస్తం

చెర్వుగట్టులోని పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానానికి టెండర్ల రూపంలో రావాల్సిన బకాయిలను గడువు ముగిసినా వసూలు చేయకపోవడం వెనుక సిండికేట్‌ని నడిపిస్తోన్న అదృశ్యహస్తముందనే ఆరోపణలున్నాయి. దేవస్థానం గతేడాది టెండర్లకు సంబంధించి రూ.41.79లక్షల బకాయిలు కాంట్రాక్టర్లనుంచి రావాల్సి ఉంది. టెండర్లు ఖరారయ్యాక గరిష్టంగా ఆరునెలల కాలంలో ఈ మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉండగా, గడువు పూర్తయి కొత్త కాంట్రాక్టులు వచ్చినా పాతబకాయిలు వసూలు చేయకపోవడం ఇక్కడ జరుగుతోన్న అక్రమాల తంతుకు, నిర్లక్ష్య పాలనకు నిదర్శనంగా చెప్పవచ్చు. దేవస్థానం భారీగా ఆదాయం కోల్పోతున్నా, అధికారికంగా రావాల్సిన బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదనే ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం కరువైంది. టెండర్ల బకాయిలను పరిశీలిస్తే.., టోల్‌గేట్ వేలంపాటకు సంబంధించి 1 జనవరి 2024 నుంచి 1 నుంచి 2025 వరకు ఏడాది కాలానికి రూ.32,05,000 టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంకా రూ.11,02,000 బకాయి ఉన్నారు. కాంట్రాక్ట్ గడువు ముగిసి నాలుగు నెలలయినా ఇంకా బకాయి వసూలు కాలేదు. గొర్రె పొట్టేళ్ల, మేకపోతుల పాటకు సంబంధించి రూ.7.50లక్షల టెండర్‌కు గాను, 1, జనవరి 2025కు గడువు ముగిసేసమయానికి రూ.3.75లక్షల బకాయి మిగిలిపోతే, ఒడిబియ్యానికి సంబంధించి 1మార్చి 2025నాటికి రూ.15.10లక్షల పాటకు, గడువు ముగిసినా ఇంకా రూ.4లక్షల బకాయి మిగిలిపోయింది. కొబ్బరిచిప్పల సేకరణ పాటకు సంబంధించి సైతం 1, మార్చి 2025 నాటికి రూ.20.10లక్షలకు ఇంకా రూ.3లక్షల బకాయి కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉంది. ఈ టెండర్ల గడువులు ముగిశాక, మళ్లీ కొత్త టెండర్లు నిర్వహించి ఆయా వ్యవహారాలు కొనసాగిస్తున్నా, పాత టెండర్లకు సంబంధించిన బకాయిలను వంద శాతం వసూలు చేయలేకపోవడం దేవస్థాన నిర్వాహకుల వైఫల్యం, సిండికేట్ ప్రభావానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇవేకాకుండా టెండరు పలికిన కొబ్బరికాయల వేలంపాటకు సంబంధించి రూ.72లక్షలకు ఇంకా రూ.20లక్షల బకాయి ఉంది. ఈ టెండరు గడువు వచ్చే 31 జూలైతో ముగియనుంది. ఇలా ప్రతీ టెండర్‌కు సంబంధించి భారీగా బకాయిలున్నప్పటికీ వాటిని నిర్ణీత గడువులోగా వసూలుచేయకపోవడం వెనక ఇక్కడ పాతుకుపోయిన సిండికేట్ ప్రభావమేనని స్పష్టమవుతోంది.

కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి



కాంటాపై ధాన్యం బస్తాను పరిశీలిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

కనగల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లను పారదర్శకంగా చేపట్టాలని డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని చర్లగౌరారం గ్రామంలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వరి ఏ గ్రేడ్ రకానికి క్వింటాకు రూ.2320, సాధారణ రకానికి రూ. 2300 చొప్పున ప్రభుత్వం అందిస్తుందన్నారు. సన్న ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తారని పేర్కొన్నారు. శుభ్రపర్చిన ధాన్యాన్ని రైతులు కేంద్రాలకు తరలించాలని సూచించారు. సీరియల్ ప్రకారం కాంటా వేయాలని నిర్వాహకులకు సూచించారు. ఒక్కో బస్తా 40.7 కిలోల చొప్పున తూకం వేయాలని హమాలీలకు సూచించారు. అంతకుముందు లింగాలగూడెం, వేమిరెడ్డిగూడెం, రేగట్టే, బోయినపల్లి గ్రామాల్లో ధాన్యం కేంద్రాలను అధికారులు ప్రారంభించారు. ఆయా కార్యక్రమాల్లో ఎల్లమ్మ ఆలయ చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఏవో అమరేందర్‌గౌడ్, ఏపీఎం సంకుహరి, సీసీలు విజయ, వసంత, సీఆర్‌పీ జానకి, కార్యదర్శి సంతోష్‌రెడ్డి, కాంగ్రెస్ కిసాన్‌సెల్ జిల్లా కన్వీనర్ గోలి జగాల్‌రెడ్డి, ఆర్టీఏ సభ్యుడు రాజురెడ్డి, నాయకులు వేమిరెడ్డి నర్సిరెడ్డి, భూపాల్‌రెడ్డి, నాగరాజు, వీబీకేలు పాల్గొన్నారు.

● చండూరు రూరల్: రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి ప్రభుత్వ గిట్టుబాటు ధర పొందాలని పీఏసీఎస్ చైర్మన్ కోడి సుష్మవెంకన్న అన్నారు. చండూరు మండల పరిధిలోని కస్తాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండారు యాదగిరి, మానిటరింగ్ ఆఫీసర్ జ్యోతిర్మయి, ఏవో చంద్రిక, నయాబ్ తహసీల్దార్ నిర్మల, మాజీ ఎంపీటీసీ వనజ పాల్గొన్నారు.

● తిప్పర్తి మండల పరిధిలోని అంతయ్యగూడెం, తానేదార్‌పల్లి, పజ్జూరు, ఎర్రగడ్డలగూడెం, మామిడాల గ్రామాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏపీఎం శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి కాలం ధాన్యంలో ఎక్కువగా తాలు గింజలు ఉంటున్నందున రైతులు ప్యాడీ క్లీనర్ సహాయంతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సంఘబంధం అధ్యక్షురాలు సునీత, సీసీ ఎమెలియా, పలువురు రైతులు పాల్గొన్నారు.



యర్రగడ్డలగూడెంలో కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సునీత, శ్రీదేవి

జీపీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నాంపల్లి: ఎంపీడీవో రామకృష్ణశర్మకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

కట్టంగూరు, నాంపల్లి, మర్రిగూడ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. జీపీ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జీపీ కార్మికులు జిల్లాలోని పలు మండల కేంద్రాల్లో ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి, పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఉదయం లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్నారని అన్నారు. నెలనెలకు వేతనాలు రాక పెండింగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కార్మికులు ఎంపీడీవోలకు వినతిపత్రం అందజేశారు.

● కట్టంగూరులోని ఎంపీడీవో కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో జీపీ కార్మికులు కాసర్ల స్వప్న, పున్నంరాజు వెంకన్న, నర్సింగ్ శ్రీను, స్వప్న, అంజయ్య, వినోద్, శంకర్, మధు, ఎల్లమ్మ, మైసయ్య, గిరి తదితరులు పాల్గొన్నారు.

● నాంపల్లిలో ప్రజా నాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి మాట్లాడుతూ జీపీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లేటి హరికృష్ణ, నాగిళ్ల ఎల్లయ్య, ఉపాధ్యక్షుడు అబ్బనబోయిన వెంకటయ్య, సహాయ కార్యదర్శి గణేష్, మరియమ్మ, అరుణ, ఉషయ్య, లక్ష్మయ్య, సభ్యులు అబ్బరలీ జువికిలాల్, బాల్కోటి అంజయ్య, సాయిలు, సైదమ్మ, సులోచన, వీరమ్మ పాల్గొన్నారు.

● మర్రిగూడలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్మికులకు ఆరు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సల్వోజు రామలింగాచారి, సీఐటీయూ నాయకులు ఉరిపక్క లింగయ్య, మైలారం నర్సింహ, జిల్లా అమృత, పెరుమాండ్ల మంజుల, కటికల భారతమ్మ, గిరి, అలివేలు, పోతరాజు కృష్ణయ్య, ముత్తమ్మ, రమణమ్మ, గ్యార దుర్గమ్మ, శిరసాల లక్ష్మయ్య, చిరసాల, రామచంద్రం, మైలారం యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

మునుగోడులో నేతల సంబరాలు



ఎమ్మెల్సీ సత్యంను అభినందిస్తున్న ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి, సీపీఐ నాయకులు

మునుగోడు, మర్రిగూడ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీగా నెల్లికంటి సత్యం ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించటాన్ని పలువురు నేతలు స్వాగతించారు. ఈ మేరకు మునుగోడులో వివిధ పార్టీలు, బీసీ అనుబంధ, ప్రజాసంఘాల నేతలు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం సాయంత్రం మునుగోడు బీఆర్ అంబేడ్కర్ చౌరస్తాలో పెద్దఎత్తున బాణసంచా కాల్చి సంబరాలు నిర్వహించారు. కాంగ్రెస్, సీపీఐ మిత్రపక్షాల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను, ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు మిర్యాల వెంకన్న, గురిజ రామచంద్రం, జిట్టగోని యాదగిరి, ఆరెళ్ల సైదులు, శ్రీనివాస్, కైలాసంగౌడ్, వెంకన్న, లింగస్వామి, శంకర్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సత్యంకు అభినందనలు తెలిపిన నేతలు

మునుగోడు మండలంలోని ఎల్లగూడెం గ్రామానికి చెందిన సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేసి బాధ్యతలు స్వీకరించిన అనంతరం పలువురు నేతలు కలిశారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పల్లా వెంకట్‌రెడ్డి, ఉజ్జిని యాదగిరిరావు, వివిధ పార్టీలు, బీసీ అనుబంధ, ప్రజాసంఘాల నేతలు జక్కలి ఐలయ్య యాదవ్, కె. శ్రీనివాస్, పానుగంటి విజయ్‌గౌడ్, బూడిద మల్లిఖార్జున్‌యాదవ్, తీర్పారి వెంకటేశ్వర్లు, రామచంద్రం, నర్సింహ, సురిగి చలపతి, చాపల శ్రీను, లాలు, కైలాసంగౌడ్, ఆరెళ్ల సైదులు పూలమాలలు వేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.

● మర్రిగూడ, మండల నాయకులు ఎమ్మెల్సీ సత్యానికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ మర్రిగూడ మండల కార్యదర్శి ఈదుల బిక్షంరెడ్డి, నాయకులు సహాయ కార్యదర్శి బూడిద సురేష్, మండల కార్యవర్గ సభ్యులు బుర్ర శేఖర్, ఎరుకల నిరంజన్‌గౌడ్, సభ్యులు ఇస్కిల్లా మహేందర్, పొట్ట అశోక్ పాల్గొన్నారు.

'ముల్కనూర్' స్ఫూర్తితో గొల్లగూడ సొసైటీ అభివృద్ధి

● పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు



ముల్కనూర్‌లో మిల్లును సందర్శించిన చైర్మన్ నాగరత్నం రాజు, డైరెక్టర్లు

నల్లగొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): హన్మకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార సంఘం చేస్తున్న అభివృద్ధిని స్ఫూర్తిగా తీసుకొని గొల్లగూడ సొసైటీ అభివృద్ధి చేస్తామని పీఏసీఎస్ చైర్మన్ ఆలకుంట్ల నాగరత్నం రాజు తెలిపారు. ముల్కనూర్ సొసైటీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను అధ్యయనం చేయడం కోసం సోమవారం సొసైటీ డైరెక్టర్లతో కలిసి సొసైటీ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముల్కనూర్ సొసైటీ ఆధ్వర్యంలో విత్తన శుద్ధి కర్మాగారం, పెట్రోల్ బంక్, గ్యాస్ గోదాం, విత్తనాల, ఎరువుల సరఫరా, రైస్ మిల్లు, రైతులకు కంటి పరీక్షలు, పత్తి మిల్లు ఏర్పాటుతో వివిధ రకాల వ్యాపారం వల్ల రూ.360కోట్ల టర్నోవర్‌తో రూ.10కోట్ల లాభాల్లో ఉందన్నారు. ముల్కనూర్ ప్రాథమిక సహకార సంఘం ఆసియా ఖండంలోనే రెండో స్థానం, రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉండటం తమకు ఎంతో స్ఫూర్తిదాయకం కానుందన్నారు. గొల్లగూడ సొసైటీని కూడా ముల్కనూరు సొసైటీ మాదిరిగా అభివృద్ధి పథంలో తీసుకుపోతామన్నారు. గొల్లగూడ సొసైటీ చైర్మన్‌తో పాటు డైరెక్టర్లకు ముల్కనూర్ సొసైటీ సీనియర్ ఆఫీసర్ వేణుమాధవ్ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో గొల్లగూడ సొసైటీ వైస్ చైర్మన్ తవిటి కృష్ణయ్య, డైరెక్టర్లు దేప వెంకట్‌రెడ్డి, రుద్రాక్షి వెంకన్న, మందడి వెంకట్‌రెడ్డి, చింత ఎల్లయ్య, పిన్నపురెడ్డి జ్యోతినర్సిరెడ్డి, దోటి అంజయ్యలతో పాటు సిబ్బంది శ్రీనివాస్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో వాహనాలు నడపొద్దు

● నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డి



వాహనాల తనిఖీని పరిశీలిస్తున్న డీఎస్పీ శివరాంరెడ్డి

కనగల్, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ శివరాంరెడ్డి హెచ్చరించారు. కనగల్ పోలీస్‌స్టేషన్ ఎదుట సోమవారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసు నమోదు చేసి జరిమానాలు విధించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇచ్చి బయటికి పంపవద్దని, ఒకవేళ నడుపుతూ పట్టుబడితే వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

పోలీసులు సమాజ సేవలోనూ ముందుండాలి

శాంతి భద్రతలతో పాటు సమాజసేవలోనూ పోలీసులు ముందుడాలని డీఎస్పీ శివరాంరెడ్డి అన్నారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కనగల్ ఎక్స్‌రోడ్డు నిత్యం వందలాది మంది ప్రయాణికులతో రద్దీగా ఉంటుందని అన్నారు. వేసవి నేపథ్యంలో ప్రయాణికులు వడదెబ్బకు గురికాకుండా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సేవా దృక్పథంతో చలివేంద్రాన్ని ఏర్పాటు చేసిన ఎస్ఐ విష్ణుమూర్తిని, అందుకు సహకరించిన సీఐ ఆదిరెడ్డిని ఆయన ప్రశంసించారు. ఇలాంటి సేవా కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది రషీద్, రమేష్, బుర్హానుద్దీన్, మోహన్, జానయ్య, సైదులు, బేబీషాలిని వివిధ పార్టీల నాయకులు, ప్రయాణికులు పాల్గొన్నారు.

ఘనంగా ఏక్ భారత్ శ్రేష్ట భారత్ వేడుకలు

శాలిగౌరారం, చిట్యాలరూరల్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పిలుపుమేరకు మండలంలోని శాలిగౌరారం, చిట్యాల మండలంలో సోమవారం ఏక్తా భారత్- శ్రేష్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్ఎంలు మాట్లాడుతూ దేశంలోని రాష్ట్రాల సంస్కృతినీ, సంప్రదాయాలను ప్రజల మధ్య అవగాహన పరచడమే కార్యక్రమ ఉద్దేశమన్నారు. విద్యార్థులు ఆయా రాష్ట్రాల వేషధారణతో హాజరయ్యారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు సంధ్యారాణి, చిత్తలూరి సత్యనారాయణ, సంపత్ కుమార్, దామెర్ల కృష్ణయ్య, కుక్కడపు శ్రీనివాస్, శ్రీరాములు, సృజన, సంగీత, అనురాధ, శ్వేత, మల్లేష్, రాధ, జెబున్నీస, సహన పాల్గొన్నారు.

● చిట్యాల మండలంలోని వెలిమినేడు ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వనజ, చంద్రకళ, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీజడల రామలింగేశ్వరస్వామి ఆలయం

రామలింగేశ్వరా.. అక్రమాలు కనవా?

భక్తుల పాలిట కొంగుబంగారంగా విరాజిల్లుతోన్న నార్కట్‌పల్లి మండలం చెర్వుగట్టు పార్వతీ జడలరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అక్రమాల పరంపర కొనసాగుతోంది. పెద్దలీడర్ల పేరు చెప్పుకుంటున్న ఛోటా లీడర్లు, ఆలయంలో పనిచేసే అధికార యంత్రాంగం కుమ్మక్కయి ఆలయ నిర్వహణని గుప్పిటపట్టి అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి-నల్లగొండ)

- చెర్వుగట్టు ఆలయ సంపదను కాజేస్తున్న అక్రమార్కులు
- సిండికేట్‌గా మారిన ఛోటా లీడర్లు, అధికార యంత్రాంగం
- బ్రహ్మోత్సవాల్లో సిండికేట్
- భారీగా చేతివాటం ప్రదర్శించిందనే ఆరోపణలు
- పూర్తి ఆధారాలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడంతో ఆర్డీవో విచారణ
- టెండర్ల బకాయిల వసూళ్లలోనూ నిర్లక్ష్యం

చెర్వుగట్టు దేవస్థానానికి భారీ ఆదాయం వస్తున్నా, రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఏ విభాగంలో అవకాశమున్నవారు ఆ విభాగంలో రామలింగేశ్వరుని సంపదను బొక్కేస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. టిక్కెట్లు, ప్రసాదాలు, తలనీలాలు, కొబ్బరికాయలు, టోల్‌గేట్లు, పారిశుధ్య నిర్వహణ, టెండర్ల నిర్వహణ ఇలా.. ఒక్కటేమిటి ఎక్కడ వీలైతే అక్కడ ఆలయ సంపదని కాజేస్తున్నారనే ఆరోపణలకు సమాధానం కరువైంది. ఇటీవల బ్రహ్మోత్సవాల నిర్వహణ జమా,ఖర్చుల్లో లోటు, భారీగా చేతివాటం ప్రదర్శించారనే ఫిర్యాదులు రావడంతో ఆర్డీవో అశోక్‌రెడ్డి విచారణ నిర్వహించారు. రెండు పర్యాయాలు ఆయన ఆలయాన్ని సందర్శించి రికార్డులు సీజ్ చేసి తీసుకెళ్లడం ఫిర్యాదులోని తీవ్రతను తెలియజేస్తోంది. ఆర్డీవో నివేదిక సమర్పిస్తే ఇక్కడ అవినీతి ఏ స్థాయిలో జరిగిందో తేట తెల్లమవుతుందని, నివేదిక వచ్చాక ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారనే అంశంపైనే సర్వత్రా ఆసక్తి కొనసాగుతోంది.

ఆ 'సిండికేట్'వైపే చూపిస్తోన్న అన్నివేళ్లు

చెర్వుగట్టు దేవస్థానంలో సిండికేట్‌గా మారిన వ్యక్తుల వల్లే ఇటీవల బ్రహ్మోత్సవాల ఆదాయం, ఇతరత్రా ఆలయ సంపద పక్కదారి పట్టిందనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఆలయ నిర్వహణలో సుదీర్ఘకాలంగా తిష్టవేసిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందితోపాటు, ఆలయాన్ని గుప్పిటపెట్టుకోవాలని చూస్తోన్న రాజకీయ నాయకులు సిండికేట్‌గా మారి స్వామివారి సంపదను కొల్లగొడుతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. ఆలయ పాలన, నిర్వహణను అస్తవ్యస్తంగా మార్చేశారు. అర్హత లేనివారికి ఆర్థిక నిర్వహణ బాధ్యతలప్పగించడం వంటి సంఘటనలు ఆలయ నిర్వహణ గాడితప్పిందనడానికి నిదర్శనంగా చెబుతున్నారు. ప్రధానంగా ఈ సిండికేట్ బ్రహోత్సవాల సమయంలో దర్శన టిక్కెట్లు, ప్రసాదాల టిక్కెట్లు, తలనీలాల టిక్కెట్ల రీసైక్లింగ్‌కు పాల్పడిందనే ఫిర్యాదులు ఉన్నతాధికారులకు చేరాయి. అంతేకాకుండా అర్హతలేని వ్యక్తికి ఆర్థిక వ్యవహారాల నిర్వహణ బాధ్యతలివ్వడం, ఏ రోజుకారోజు జమా, ఖర్చులు రాయకపోవడం, నగదును బ్యాంకులో జమచేయకపోవడం వంటి లోపాలకు ఈ సిండికేటే కారణమని చెబుతున్నారు. బ్రహ్మోత్సవాల ఆదాయమే కాదు, రోజువారీ ఆదాయం విషయంలోనూ చేతివాటం ప్రదర్శిస్తున్నారని, పైగా టెండర్ల ద్వారా రావాల్సిన ఆదాయాన్ని సైతం సకాలంలో వసూలు చేయకుండా కాలయాపన చేసి చివరకు గడువు ముగిశాక భారీగా బకాయిలు పేరుకుపోతున్నాయని చెబుతున్నారు. మొత్తంగా ఆలయ సంపదను అక్రమార్గంలో దోచుకుంటున్న సిండికేట్‌పై వచ్చిన ఫిర్యాదుతోనే ఆర్డీవో విచారణ జరిగిందని, ఈ సిండికేట్ ఉన్నతాధికారులపైనా ఒత్తిడి తెస్తోందని, నివేదికను బయటకు రాకుండా చూడాలని ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సిండికేట్‌ని నిరోధిస్తే తప్ప చెర్వుగట్టు దేవస్థానంలో అవినీతికి అడ్డుకట్టపడదనే అభిప్రాయం భక్తుల్లో వెలువడుతోంది. సిండికేట్‌లో....

- మిగతా 8వ పేజీలో...

'రాజీవ్ యువవికాసం'

మార్గదర్శకాలు ఇవే

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

నల్లగొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు చెందిన యువతీ, యువలకు ఆర్థిక సాయం అందించడంకోసం రాజీవ్ యువ వికాసం పథకాన్ని ప్రారంభించింది. ఈ పథకానికి సంబంధించి సోమవారం మార్గదర్శకాలను విడుదల చేసింది. ఆర్థికసాయం సంబంధించిన పథకాలకు రూ.50వేల యూనిట్‌కు 100 శాతం సబ్సిడీ, రూ.50,001 నుంచి రూ.లక్ష వరకు 90శాతం సబ్సిడీ, 10శాతం బ్యాంకు రుణం ఇస్తారు. ఇక రూ.లక్ష నుంచి రూ.2లక్షల వరకు 80శాతం సబ్సిడీ, 20 శాతం బ్యాంకు రుణం ఇవ్వనుండగా, రూ.2లక్షల నుంచి రూ.4లక్షల వరకు 70 శాతం సబ్సిడీ, 30 శాతం బ్యాంకు రుణం అందజేస్తారు. అత్యంత దుర్బలమైన పరిస్థితిలో ఉన్న వారికి లక్ష రూపాయల్లో 90శాతం సబ్సిడీ, 10 శాతం ఈఎంఎఫ్ ద్వారా అందజేస్తారు. చిన్న నీటి పారుదల పథకాలకు 100శాతం సబ్సిడీ ఇవ్వనున్నారు. పథకాల గ్రౌడింగ్‌కు ఎంపికైన లబ్ధిదారులకు శిక్షణ ఇవ్వనున్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి



పీహెచ్‌సీని ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి

త్రిపురారం, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మాటూరు గ్రామంలో రూ.20లక్షలతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వా త ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంకోసం ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.అనంతరం మండలంలోని మాటూరు, డొంకతండా, త్రిపురారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమాళ్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం పాల్గొన్నారు.

ప్యాడీ క్లీనింగ్ చేస్తేనే కాంటా వేస్తాం

- నిర్వాహకులకు ఆదేశాలు జారీ చేసిన జిల్లా అధికారులు
- తిప్పర్తి మార్కెట్‌లో నాలుగు రోజులుగా రైతుల అవస్థ



తిప్పర్తిలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో అశోక్‌రెడ్డి

తిప్పర్తి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోళ్లలో రైతులకు నిత్యం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్యాడీ క్లీనర్‌తో శుభ్రం చేసిన ధాన్యం మాత్రమే కాంటా వేయాలని జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు రావడంతో నిర్వాహకులు కొనుగోళ్లు నిలిపివేశారు. ధాన్యంలో తాలు ఉందనే కారణంతో తిప్పర్తి మార్కెట్ యార్డులో నాలుగు రోజుల నుంచి కొనుగోళ్లు నిలిచిపోయాయి. రెండు రోజుల క్రితం సుమారు మూడు వేల క్వింటాళ్ల ధాన్యం లోడ్ చేసేందుకు కాంటా వేసి ఉంచగా బస్తాలు పాడవకుండా లోడ్‌తో మిల్లులకు వెళ్లిన లారీలు ఇప్పటి వరకు దిగుమతి కాలేదు. ఈ కారణంతో లారీ యజమానులు లోడ్ చేసేందుకు అనుమతించలేదు. దీంతో మరో రెండు రోజులు కొనుగోళ్లు నిలిచిపోయాయి. ఇప్పటి నుంచి మంచి ధాన్యం పంపిస్తామని నిర్వాహకులు చెప్పడంతో రెండు, మూడు లారీల ధాన్యం దిగుమతి చేసుకున్న మిల్లు నిర్వాహకులు ఎక్కువ తాలు వస్తోందని ఆదివారం నుంచి దిగుమతి నిలిపివేశారు. దీంతో అక్కడికి వెళ్లిన నాలుగు లారీల ధాన్యం దిగుమతి కాకుండానే మిల్లుల్లోనే ఉండిపోయింది. ఈ కారణంతో సోమవారం తిప్పర్తి మార్కెట్‌లో కాంటా వేయడమే నిలిపివేశారు. ప్రస్తుతం వరి కోతలు ఊపందుకోవడంతో మార్కెట్‌లో నిల్వ ఉన్న ధాన్యం సుమారు 25 వేల నుంచి 30 వేల క్వింటాళ్ల వరకు ఉండవచ్చు. ధాన్యం కాంటాలు నిలిచిపోయాయనే సమాచారంతో సోమవారం సాయంత్రం నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీసీవో పాచ్యానాయక్‌లతో పాటు జిల్లా, మండల స్థాయి నాయకులు ధాన్యం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ ధాన్యం ప్యాడీ క్లీనర్‌లతో శుభ్రం చేస్తే తప్ప కాంటా వేసేది లేదని నిర్వాహకులకు సూచించి వెళ్లారు. అదే విధంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు మార్కెట్‌లో ప్యాడీ క్లీనర్ నడిచేలా విద్యుత్ సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పరుశురామ్, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, పాశం సంపత్‌రెడ్డి, ఏవో సన్నిరాజు, ఏఈవో అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిస్‌వరల్డ్ పోటీదారులకు ఏర్పాట్లు చేయాలి

- బుద్ధపూర్ణిమ రోజు బుద్ధవనం సందర్శనకు రాక
- కలెక్టర్ ఇలాత్రిపాఠి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ టౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): బుద్ధపూర్ణిమ సందర్భంగా మే 12న నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనం సందర్శనకు వచ్చే మిస్ వరల్డ్ పోటీదారులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. మిస్ వరల్డ్ పోటీదారుల రాక సందర్భంగా ఏర్పాట్లపై తన ఛాంబర్‌లో పర్యాటక, రెవెన్యూ, పోలీస్, ఇతర అధికారులతో సోమవారం సమీక్ష నిర్వహించారు. ఆసియా దేశాలకు చెందిన 30 మంది ప్రపంచ సుందరి పోటీదారులు బుద్ధపూర్ణిమ సందర్భంగా నాగార్జునసాగర్ వద్ద ఉన్న బుద్ధవనానికి వస్తున్నారని, ఆ రోజు సాయంత్రం 4.30 నుంచి 7.30 వరకు విజయ విహార్, బుద్ధవనంలో వారు గడిపే అవకాశముందని తెలిపారు. హైదరాబాద్ నుంచి వచ్చే దారిలో చింతపల్లి వద్ద కాసేపు విశ్రాంతి తీసుకుని బుద్ధవనానికి చేరుకుంటారని, అనంతరం బుద్ధవనంలో జాతక వనాన్ని పరిశీలిస్తారని, అనంతరం బుద్ధుని ధ్యాన మందిరం వద్ద ధ్యానంలో పాల్గొంటారని తెలిపారు. ప్రొటోకాల్ ప్రకారం తీసుకోవాల్సిన ఏర్పాట్లపై రెవెన్యూ అధికారులకు, బందోబస్తు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై పోలీసులకు సూచనలు చేశారు. పాసులు ఉన్న వారిని తప్ప ఇతరులు ఎవరినీ బుద్ధ వనంలోకి అనుమతించకూడదని స్పష్టం చేశారు. విజయ్ విహార్‌లో వారు విశ్రాంతి తీసుకునేందుకు గదులు సిద్ధం చేయాలని, ఒకవేళ నాగార్జునసాగర్ డ్యామ్‌ను చూసేందుకు వస్తే అక్కడ ఏర్పాట్లు చేయాలన్నారు. మునిసిపల్ సిబ్బంది తాగునీరు, దారి పొడవునా పరిశుభ్రం చేయాలన్నారు. ప్రపంచ సుందరి పోటీలో పాల్గొనే వారు తిరిగే అన్ని ప్రదేశాలను ముందే తిరిగి పరిశీలించాలని, సీసీటీవీలు ఏర్పాటు చేయాలని, మెడికల్ టీం, ఫైర్ టీములు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆహారం, తాగునీరుతో పాటు, అన్ని విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రత్యేకించి ఒక్కో ప్రదేశం వద్ద ఒక సీఐ స్థాయి అధికారిని ఇన్‌చార్జిగా నియమించాలన్నారు. సమావేశంలో మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, దేవరకొండ ఆర్డీవో రమణారెడ్డి, బుద్ధవనం ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ సూదన్‌రెడ్డి, మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖర్, మిర్యాలగూడ మునిసిపల్, రెవెన్యూ అధికారులు, జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలి

లబ్ధిదారులకు పథకాల అమలులో జాప్యం లేకుండా చూడాలని కలెక్టర్ ఇలా త్రిపాఠీ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టర్‌లోని సమావేశ మందిరంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమ్మిళిత సమావేశంలో మాట్లాడారు. ముఖ్యమైన కార్యక్రమాల నిర్వహణలో మండల ప్రత్యేక అధికారులను భాగస్వామ్యం చేయాలన్నారు. తాగునీటికి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రత్యేకించి ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులు క్షేత్రస్థాయిలో ఉండి ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. వయోవృద్ధులు, దివ్యాంగులకు నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజావాణి కార్యక్రమానికి ఇదివరకే నిర్ధేశించినట్లు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

పౌష్టికాహారంపై మరోసారి సదస్సు

దేవరకొండ డివిజన్‌లో పౌష్టికాహార ప్రాముఖ్యం పై మరోసారి సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. స్థానిక శాసనసభ్యులను భాగస్వామ్యం చేస్తామని ఇందుకు సంబంధించి ప్రణాళిక రూపొందించాలని జిల్లా సంక్షేమ అధికారిని ఆదేశించారు. ఈ నెల 8 నుంచి పది రోజులపాటు పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహిళలు, గర్భిణులు, పిల్లలు, బాలింతలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం ఆరోగ్య జాగ్రత్తలపై గిరిజన ప్రాంతాల్లోని మహిళలకు తెలియజేసే విధంగా మరోసారి అవగాహన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాలు, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. టీఎస్ ఐ-పాస్ కింద వచ్చిన దరఖాస్తులను ఆమోదించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఇన్‌చార్జి డీఆర్‌వో వై. అశోక్‌రెడ్డి, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాతాశిశు మరణాల నివారణకు కృషి చేయాలి

మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి

నల్లగొండటౌన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మాతాశిశు మరణాల నివారణకు కృషిచేయాలని మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీవాణి అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం 'ఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనక భవిష్యత్తు' అనే అంశంపై ప్రభుత్వ మెడికల్ కాలేజీ, సామాజిక వ్యాధి నివారణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మెడికల్ విద్యార్థులు సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని మధురానగర్ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. మాతాశిశు మరణాలు తగ్గించేందుకు పౌష్టికాహారాన్ని తీసుకోవడమే కాకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. డబ్ల్యూహెచ్‌వో లెక్కల ప్రకారం ప్రతీ సంవత్సరం సుమారు మూడు లక్షల మంది మహిళలు ప్రసవం సమయంలో ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లి నవజాత శిశువుల ఆరోగ్యమే కుటుంబాలు, సమాజాల శ్రేయస్సును ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రభావితం చేస్తుందన్నారు. తల్లి గర్భం దాల్చడానికి ముందునుంచే గుడ్లు, పాలు, ఆకు కూరలు, ఇతర కూరగాయలు, పండ్లు వంటి పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్ర మాట్లాడుతూ ప్రభుత్వాలు అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, పిల్లలకు అందజేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గర్భధారణ సమయంలో హానికరమైన పదార్థాలకు (పొగాకు, మద్యం వంటివి) దూరంగా ఉండాలని అన్నారు. అనంతరం పిల్లలు, గర్భిణులకు ప్రిన్సిపాల్ పౌష్టికాహారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ భాగ్యరేఖ, ట్యూటర్లు డాక్టర్ శ్వేత, మధులత, హెల్త్ ఎడ్యుకేటర్లు స్వామి, నాగలక్ష్మి, జ్యోతి, ఆఫీస్ సిబ్బంది, ఆశా వర్కర్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.



అంగన్‌వాడి కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న శ్రీవాణి

నూతన ఎమ్మెల్సీలకు శుభాకాంక్షలు





ఎమ్మెల్యేకోటాలో నూతన ఎమ్మెల్సీలుగా ఎన్నికైన కేతావత్ శంకర్‌నాయక్, విజయశాంతి, నెల్లికంటి సత్యంలకు అభినందనలు తెలుపుతున్న శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీర్‌రెడ్డి, విప్ బీర్ల అయిలయ్య, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, జైవీర్‌రెడ్డి, బాలునాయక్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



కట్టంగూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న వీరేశం

కట్టంగూరు, నార్కట్‌పల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. కట్టంగూరు మండలంలోని కట్టంగూరు, అయిటిపాముల, కురుమర్తి, చెర్వు అన్నారం, నార్కట్‌పల్లి మండలంలోని అమ్మనబోలు, అక్కెనపల్లి, చిన్నతుమ్మల గూడెం, పల్లెపహడ్‌లో సోమవారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కట్టంగూరులో డీఆర్‌డీవో పీడీ శేఖర్‌రెడ్డి, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, మాజీ జడ్పీటీసీలు మాద యాదగిరి, నర్సింహ, ఏవో గిరిప్రసాద్, నార్కట్‌పల్లి మండలంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఊశయ్య, బండ సాగర్‌రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, శ్యాంసుందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి పాల్గొన్నారు.

శరవేగంగా విజయవిహార్ ఆధునికీకరణ

- రూ.5కోట్లతో పూర్తికి కసరత్తు
- సాగర్‌కు రానున్న 140 దేశాల మిస్‌వరల్డ్ పోటీ యువతులు, దేశ, విదేశీ మీడియా ప్రతినిధులు

6



వాహనాల బహిరంగ వేలం నేడు

మిర్యాలగూడ అర్బన్, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మిర్యాలగూడ ఎక్సైజ్‌శాఖ సర్కిల్ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో జప్తుచేసిన వాహనాల వేలంపాట మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఎక్సైజ్ ఎస్ఐ రము సోమవారం తెలిపారు. పలు కేసుల్లో పట్టుబడిన ద్విచక్ర వాహనాలను స్థానిక కార్యాలయంలో వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగినవారు మంగళవారం ఉదయం 11గంటలకు కార్యాలయం వద్దకు చేరుకొని వేలంపాటలో పాల్గొనాలని ఆయన కోరారు.

చలివేంద్రాలు ఏర్పాటు అభినందనీయం

దేవరకొండ, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): గ్రామాలు, తండాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చడం అభినందనీయమని ఎంపీడీవో డానియెల్ అన్నారు. మండలంలోని మైనంపల్లిలో చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. మాజీ ఎంపీటీసీ కొర్ర గౌతమిరాంసింగ్, మాజీ ఉప సర్పంచ్ వెంకట్ ఆధ్వర్యంలో వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా చలివేంద్ర ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఎస్ అంబేడ్కర్, నిరంజన్, కీర్తి పాల్గొన్నారు.

‘మిర్యాల’లో పద్మవ్యూహంలా ట్రాఫిక్

- పట్టింపులేని ప్రజాప్రతినిధులు
- అవస్థలు పడుతున్న ప్రజలు

మిర్యాలగూడ పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. గతంలో ప్రధాన రహదారులలనే ట్రాఫిక్ అధికంగా ఉండగా.. ప్రస్తుతం అంతర్గత రహదారులలోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

(మిర్యాలగూడ టౌన్- ఆంధ్రజ్యోతి)

ఒకవైపు పట్టణ జనాభా పెరుగుతుండగా, మరో వైపు వాహనాల సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది. ప్రణాళిక లేక రహదారులన్నీ ఇరుకుగా ఉండటం, రోడ్లపైనే వాహనాలను పార్క్ చేయడంతో ట్రాఫిక్ పెరిగింది. ఉదయం, సాయంత్రపు వేళల్లో విద్యాలయాలు, కార్యాలయాలకు వెళ్లే వారి వాహనాలతో పట్టణ రహదారులన్నీ రద్దీతో కిటకిటలాడుతున్నాయి. రోడ్డును క్రాస్ చేయలేని ఏర్పడిందని పాదచారులు వాపోతున్నారు.

● ఆ రూట్లలో మరీ ఇబ్బందిగా..

పట్టణంలోని డాక్టర్స్ కాలనీ, చర్చి రోడ్డు, పాత వైష్ణవి హోటల్ రోడ్లలో వాహనాల రద్దీతో ప్రయాణం నరకంగా మారింది. సాక్షాత్తూ సబ్ కలెక్టర్ అధికారిక నివాసం రహదారిలో రోడ్డుకు ఇరువైపులా అర కిలోమీటరు మేర వాహనాలను పార్క్ చేస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. ఆ రహదారంతా ఓ హోటల్‌లో విధులు నిర్వహించే ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది కంట్రోల్‌లో ఉంటోంది. ఈ ప్రాంతంలో ఓ వాహనదారుడికైనా ఫోన్ వస్తే, ఆపి మాట్లాడుతున్నా ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది తరిమేస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 10 నుంచి 15 అడుగుల విస్తీర్ణం కూడా లేని డాక్టర్స్ కాలనీ రహదారుల్లోకి అంబులెన్స్ సరేసరి, ఆటోలు కూడా సక్రమంగా వెళ్లలేని దుస్థితి ఉంది. ఆ కాలనీకి వచ్చే వాహనాలన్నీ చర్చి రోడ్డులో ఇరువైపులా పార్క్ చేస్తున్నందున ఈ రహదారి ఇరుకుగా మారి వాహనాల రాకపోకలను తీవ్ర అంతరాయం కలుగుతోంది.

● ఆక్రమణలతో అగచాట్లు

సాగర్ రోడ్డులోని గాంధీ విగ్రహం నుంచి రెడ్డీ కాలనీకి వెళ్లే రహదారి ఆక్రమణలతో నిండిపోతోంది. ఆ రూట్లో కర్రీ పాయింట్లు, ఫాస్ట్ ఫుడ్ స్టాళ్ల నిర్వాహకులు బల్లలు, టేబుల్స్ రోడ్లపై వేసి విక్రయాలు సాగిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నివాసాలనే దుకాణాలుగా మార్చి యథేచ్ఛగా వ్యాపారాలు సాగిస్తున్నారు. మరో వైపు గాంధీ విగ్రహం ఎదుటే ఉన్న సిట్టింగ్ రూంకు వచ్చే మందు బాబులు నడి రోడ్డుపై వాహనాలను పార్క్ చేస్తున్నా సంబంధిత అధికారుల నుంచి స్పందనే లేదని ఆ కాలనీ వాసులు వాపోతున్నారు. గాంధీ విగ్రహానికి ఎడమవైపున ఉన్న రెండు ప్రధాన బ్యాంకులు ఈ రహదారినే పార్కింగ్‌కు వినియోగించుకుంటున్నాయి. ఆ రూట్లో మొదటి దుకాణంలో ఏర్పాటు చేసిన కర్రీ, ఫుడ్ పాయింట్ వద్ద మధ్యాహ్నం రెండుగంటల పాటు వాహనదారులు ట్రాఫిక్‌లో చిక్కుకుని ఇబ్బంది పడుతున్నారు.



మిర్యాలగూడ - సాగర్ రోడ్డు నుంచి సబ్ కలెక్టర్ నివాసానికి వెళ్లే రహదారిలో ఇరువైపులా నిలిపిన వాహనాలు

రహదారులపైనే వాహనాలు నిలుపుతున్నారు



రహదారులపైనే వాహనాలు నిలుపుతున్నారు. ఏ కాలనీలో చూసిని ఇదే పరిస్థితి కనిపిస్తోంది. అలా బైక్‌లు, కార్లు నిలపడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతోంది. కాలనీలు, అంతర్గత రహదారులలో అయితే ఇబ్బంది ఉండదు.. ప్రధాన రోడ్లలో ఇలా వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకోవాలి.

● లింగానాయక్, మిర్యాలగూడ

పార్కింగ్‌కు స్థలం కేటాయించుకోవాలి



వ్యాపార, వాణిజ్య సంస్థలు పార్కింగ్ కోసం స్థలం కేటాయించుకోవాలి. ఆయా కేంద్రాలకు వచ్చే వారు వాహనాలు నిలపడం తమకేమీ సంబంధం లేనట్లుగా వ్యవహరించడం సరికాదు. సంబంధిత శాఖల అధికారులు పర్యవేక్షణ చేయాలి. వాహనాలు రహదారులపై నిలపకుండా చూడాలి. ఒకట్రెండు రోజులు ట్రాఫిక్ ఇబ్బంది ఉంటే సర్దుకోవచ్చు. నిత్యం ఇలానే ఉంటే ఇబ్బందే కదా.

- కె. అశోక్, మిర్యాలగూడ

వైభవంగా శ్రీరాములోరి రథోత్సవం



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

చింతపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని సోమవారం గొడుకొండ్లలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు అత్యంత వైభవంగా శ్రీరాముని రథోత్సవాన్ని నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేయడంతో పాటు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గొడుకొండ్ల గ్రామానికి చెందిన మల్లోజు జగన్‌చారి శైలజ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన పెంపొందించుకోవాలని అన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ చైర్మన్ అంగిరేకుల గోపాల్, ధర్మకర్తలు ఇడుకుళ్ల రామ్మోహన్, కడారి జంగయ్య, సురిగి వెంకటయ్య, గ్యార ఉమా యాదయ్య, నాయకులు పూరె లక్ష్మణ్, అంగిరేకుల గోవర్ధన్, మాస భాస్కర్, యువసేన, హన్‌మాన్, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు మంత్రి కోమటిరెడ్డి అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న మంత్రి వెంకట్‌రెడ్డి

కొండమల్లేపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రంలోని త్రివేండ్రంలో మార్చి 28న నిర్వహించిన దివ్యాంగ విద్యార్థులకు నిర్వహించిన క్రీడా పోటీల్లో మండలంలోని జోగ్యతండా సమీపంలోని సాలిడార్ పాఠశాలకు చెందిన 8వ, 9వ తరగతుల ఐదుగురు విద్యార్థులు 100 మీటర్లు, జావెలిన్‌త్రో తదితర విభాగాల్లో పతకాలు సాధించారు. ఈ విద్యార్థులతో పాఠశాల నిర్వాహకుడు భాస్కర్ సోమవారం హైదరాబాద్‌లోని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన దివ్యాంగ విద్యార్థులను మంత్రి అభినందించి సన్మానించారు.

సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరం

- ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి



లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

హాలియా, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిందని ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి అన్నారు. హాలియా మునిసిపాలిటీలోని సోమవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 35మందికి మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను ఆయన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకున్న పేద, మధ్య తరగతి వర్గాల ప్రజలు అప్పుల పాలు కాకుండా సీఎం సహాయనిధి పథకం ఉపయోగపడుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీలు సుమతి పురుషోత్తం, అల్లి పెద్దిరాజుయాదవ్, నాయకు లు ఎక్కలూరి శ్రీనివాస్‌రెడ్డి, వర్ర వెంకట్‌రెడ్డి, రమేష్, నడ్డి లింగయ్యయాదవ్, వడ్డే సతీష్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, బీవీ రమణరాజు, హలీం, అంజాద్‌ఖాన్, జలీల్, సైదులు, ఎల్లయ్య, రమేష్, మార్క్, శ్రీను, జానీ, మక్బుల్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీలకు ఎమ్మెల్యే బాలునాయక్ శుభాకాంక్షలు

దేవరకొండ, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): శాసనమండలి సభ్యులుగా హైదరాబాద్‌లో ప్రమాణస్వీకారం చేసిన నూతన ఎమ్మెల్సీలను సోమవారం ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, అద్దంకి దయాకర్, విజయశాంతిలను శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, ఎంపీ రఘువీర్‌రెడ్డితో కలిసి ప్రమాణా స్వీకారోత్సవంలో పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. ప్రమాణ స్వీకారం చేసిన శాసనమండలి సభ్యులు రాష్ట్ర అభివృద్ధికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

● నిడమనూరు: శాసనమండలిలో సోమవారం ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేసిన డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్‌ను నిడమనూరు మాజీ ఎంపీపీ అంకతి వెంకటరమణ, వెనిగండ్ల సింగిల్‌విండో మాజీ చైర్మన్ సైదయ్యనాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సన్మానించారు.

రామలింగేశ్వరా... అక్రమాలు కనవా...?

(5వ పేజీ తరువాయి)

భాగస్వామ్యమైన అధికారులు, ఉద్యోగులు, సిబ్బందిని గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని, అనధికార వ్యక్తులను ఆలయవ్యవహారాల్లో జోక్యం చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఆర్డీవో నివేదికను వేగవంతంగా తెప్పించడంతో పాటు, మొత్తం ఆలయ నిర్వహణ, ఆదాయ, వ్యయాలపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ నిర్వహించి చర్యలు చేపట్టాలని, ఆలయంలో అక్రమాల నిరోధానికి ప్రక్షాళన చర్యలు చేపట్టాలనే డిమాండ్ భక్తుల నుంచి వస్తోంది.

బకాయిలు వసూలు చేయలేకపోవడం వెనుక అదృశ్య హస్తం

చెర్వుగట్టులోని పార్వతీ జడలరామలింగేశ్వర స్వామి దేవస్థానానికి టెండర్ల రూ పంలో రావాల్సిన బకాయిలను గడువు ముగిసినా వసూలు చేయకపోవడం వెనుక సిండికేట్‌ని నడిపిస్తోన్న అదృశ్యహస్తముందనే ఆరోపణలున్నాయి. దేవస్థానం గతేడాది టెండర్లకు సంబంధించి రూ.41.79లక్షల బకాయిలు కాంట్రాక్టర్ల నుంచి రావా ల్సి ఉంది. టెండర్లు ఖరారయ్యాక గరిష్టంగా ఆరునెలల కాలంలో ఈ మొత్తాన్ని వసూలు చేయాల్సి ఉండగా, గడువు పూర్తయి కొత్త కాంట్రాక్టులు వచ్చినా పాతబకాయిలు వసూలు చేయకపోవడం ఇక్కడ జరుగుతోన్న అక్రమాల తంతుకు, నిర్లక్ష్య పాలనకు నిదర్శనంగా చెప్పవచ్చు. దేవస్థానం భారీగా ఆదాయం కోల్పోతున్నా, అధికారికంగా రావాల్సిన బకాయిలు ఎందుకు వసూలు చేయడం లేదనే ప్రశ్నకు అధికారుల నుంచి సమాధానం కరువైంది. టెండర్ల బకాయిలను పరిశీలిస్తే.., టోల్‌గేట్ వేలంపాటకు సంబంధించి 1 జనవరి 2024 నుంచి 1 నుంచి 2025 వరకు ఏడాది కాలానికి రూ.32,05,000 టెండరు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఇంకా రూ.11,02,000 బకాయి ఉన్నారు. కాంట్రాక్ట్ గడువు ముగిసి నాలుగు నెలలయినా ఇంకా బకాయి వసూలు కాలేదు.

గొర్రె పొట్టేళ్లు, మేకపోతుల పాటకు సం బంధించి రూ.7.50లక్షల టెండర్‌కు గాను, 1, జనవరి 2025కు గడువు ముగిసేసమయానికి రూ.3.75లక్షల బకాయి మిగిలిపోతే, ఒడిబియ్యానికి సంబంధించి 1మార్చి 2025నాటికి రూ.15.10లక్షల పాటకు, గడువు ముగిసినా ఇంకా రూ.4లక్షల బకాయి మిగిలిపోయింది. కొబ్బరిచిప్పల సేకరణ పాటకు సంబంధించి సైతం 1, మార్చి 2025 నాటికి రూ.20.10లక్షలకు ఇంకా రూ.3లక్షల బకాయి కాంట్రాక్టర్ చెల్లించాల్సి ఉంది. ఈ టెండర్ల గడువులు ముగిశాక, మళ్లీ కొత్త టెండర్లు నిర్వహించి ఆయా వ్యవహారాలు కొనసాగిస్తున్నప్పటికీ, పాత టెండర్లకు సంబంధించిన బకాయిలను వందశాతం వసూలు చేయలేకపోవడం దేవస్థాన నిర్వాహకుల వైఫల్యం, సిండికేట్ ప్రభావానికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఇవేకాకుండా టెండరు పలికిన కొబ్బరికాయల వేలంపాటకు సంబంధించి రూ.72లక్షల కు ఇంకా రూ.20లక్షల బకాయి ఉంది. ఈ టెండరు గడువు వచ్చే 31 జూలైతో ముగియనుంది. ఇలా ప్రతీ టెండర్‌కు సంబంధించి భారీగా బకాయిలున్నప్పటికీ వాటిని నిర్ణీత గడువులోగా వసూలుచేయకపోవడం వెనక ఇక్కడ పాతుకుపోయిన సిండికేట్ ప్రభావమేనని స్పష్టమవుతోంది.

లింక్ రోడ్లను పట్టించుకోరా?

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు, రైతులు
- పట్టించుకోని ప్రజాప్రతినిధులు, అధికారులు



కుక్కడం- పూసలపాడు గ్రామాల మధ్య అధ్వానంగా ఉన్న రోడ్డు

మాడ్గులపల్లి, ఏప్రిల్ 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే ధ్యేయమని చెబుతున్న ప్రభుత్వం చేతల్లో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఎంతమంది పాలకులు, అధికారులు మారినా తమ సమస్యను పరిష్కరించే వారు కరువయ్యారని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలను కలిపే లింకు రోడ్లను మాత్రం పట్టించుకోవడం లేదు. మండలంలోని మాడ్గులపల్లి- పూసలపాడు రహదారి మట్టి రోడ్డు కావడంతో కొద్దిపాటి వర్షానికే చిత్తడిగా మారుతంది. ఇప్పటికే గుంతలమయమై కంకరతేలడంతో పాదచారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 5 కిలో మీటర్ల మేర ఉన్న ఈ రహదారిపై రాకపోకలు సాగించాలంటే ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఏండ్ల తరబడి అధ్వానంగా ఈ రహదారిని పట్టించుకునే నాథుడే కరువవడంతో గ్రామస్థులు అవస్థలు పడుతూ రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు పెరగడంతో ప్రయాణం సాగించలేని దుస్థితి నెలకొంది. గ్రామాల్లోని విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలన్నా, గ్రామస్థులు, రైతులు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వెళ్లాలన్నా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు దుస్థితి చూసి ఆటోలు సైతం ఇటువైపు రాకపోవడంతో నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్య సమయంలో అధ్వానంగా ఈ రహదారి గుండా వాహనాల్లో సకాలంలో ఆసుపత్రులకు చేరలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు, అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఓట్లు అడగడానికి మాత్రమే రాజకీయ పార్టీల నాయకులు వస్తున్నారే తప్ప తమ సమస్యలను పరిష్కరించేవారే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అధ్వానంగా ఉన్న మాడ్గులపల్లి- పూసలపాడు రహదారిని బీటీ రోడ్డుగా మార్చి సమస్యను పరిష్కరించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా పూసలపాడు- కుక్కడం రోడ్డు కూడా గుంతలమయంగా మారడంతో ప్రయాణం సాగించాలంటే నానా అవస్థలు పడాల్సి వస్తుంది. రోడ్డు మొత్తం కంకరతేలి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు గుంతలమయంగా ఉండటంతో పూసలపాడు గ్రామాల ప్రజలు నిత్యం పనుల నిమిత్తం గజలాపురం, కుక్కడం గ్రామాల నుంచి మండల కేంద్రానికి ప్రయాణం చేయాల్సి వస్తుంది. దీంతో దూరభారం పెరుగుతుండటంతో తాము ఇబ్బందులకు గురవుతున్నారని వెంటనే ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి ప్రయాణికుల ఇబ్బందులకు తొలగించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేయాలి



మాడ్గులపల్లి మండలంలోని పూసలపాడు, కుక్కడం, మాడ్గులపల్లి గ్రామాల మధ్య ఉన్న రోడ్డు అధ్వానంగా ఉంది. దీనిపై ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి.

- నడ్డి లింగయ్య, పూసలపాడు

ప్రతిపాదనలు పంపించాం



మాడ్గులపల్లి- పూసలపాడు, కుక్కడం గ్రామాల మధ్య ఉన్న రోడ్లకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుంచి నిధులుమంజూరైన వెంటనే పనులు చేపడతాం.

- మధు, ఏఈ, పంచాయతీరాజ్

పేదల సంక్షేమానికి పెద్దపీట

- ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి

హాలియా, తిరుమలగిరి(సాగర్), ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని హాలియా, తిరుమలగిరి(సాగర్) మండలాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. హాలియా మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో సన్నబియ్యం కార్యక్రమంలో భాగంగా నిరుపేద ఇంట్లో సన్నబియ్యం సహపంక్తి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెల్లకార్డు కలిగి ఉన్న ప్రతీ ఒక్కరికి సన్నబియ్యం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. అదేవిధంగా అనుముల మండలం చింతగూడెం గ్రామంలో కూరాకుల పార్వతమ్మ కృష్ణయ్య ఏర్పాటు చేసిన సన్నబియ్యం సహపంక్తి భోజనంలో పాల్గొని గ్రామస్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కాకునూరి నారాయణగౌడ్, వైస్ చైర్మన్ కాంసాని చంద్రశేఖర్, నాయకులు చింతల చంద్రారెడ్డి, బైరెడ్డి కోటిరెడ్డి, గౌని రాజారమేష్‌యాదవ్, నకిరేకంటి సైదులు, నిమ్మల లక్ష్మారెడ్డి, సుధాకర్‌రెడ్డి, ముత్యాలుపాల్గొన్నారు.



మాడ్గులపల్లి: గారకుంటపాలెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పీడీ శేఖర్‌రెడ్డి

● తిరుమలగిరి(సాగర్) మండల కేంద్రంతో పాటు రంగుండ్లలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులు నాణ్యమైన ధాన్యం తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. కార్యక్రమంలో హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్ తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్, ఎంపీడీవో మల్లేశ్వర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు శాగం మంగమ్మ, అంగోతు పాండునాయక్, ఆలయ కమిటీ చైర్మన్ శాగం నాగిరెడ్డి, ఏవో హర్షిత, ఏఈవోలు సుష్మిత, జ్యోతి, ఆర్ఐ లక్ష్మీకాంత్, ఐకేపీ ఏపీఎం నరసింహ, సీసీలు తంగమణి, విజయ్, మాజీ ఎంపీపీ భగవాన్‌నాయక్, శాగం పెద్దిరెడ్డి, చంద్రారెడ్డి, నాగిరెడ్డి, శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.



తిరుమలగిరి సాగర్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

కొనుగోలు కేంద్రాలలో మద్దతు ధర : పీడీ

మాడ్గులపల్లి: ప్రభుత్వం ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి రైతులు ప్రభుత్వ గరిష్ఠ మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి అన్నారు. మండలంలోని గారకుంటపాలెం గ్రామంలో సోమవారం డీఆర్‌డీఏ సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యపు కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు ధాన్యం కాంటాలు నిర్వహించే సమయానికి తమ ఆధార్‌కార్డు, బ్యాంకు, పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్‌లను నిర్వాహకులకు అందించాలని సూచించారు. అప్పుడే సకాలంలో నగదు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, డీఆర్‌డీఏ డీపీఎం బెనర్జీ, ఏపీఎం బాషపాక చంద్రశేఖర్, ఆర్ఐ నాగయ్య, సీసీ నాగయ్య, వీవో అధ్యక్షురాలు శివలీల, ఏఈవో వేణుగోపాల్, వీవోఏ సోమయ్య, నాగలక్ష్మి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్‌లో ఉన్న కార్మికుల వేతనాలు చెల్లించాలి



పెద్దవూర: ఎంపీడీవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందచేస్తున్న సీఐటీయూ నాయకులు

మాడ్గులపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామపంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకుడు రొండి శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కార్యాలయంలో వినతిపత్రం అందచేసి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 15నెలలు దాటినా గ్రామ పంచాయతీ కార్మికులకు మూడు నెలల నుంచి 8 నెలల వరకు వేతనాలు అందక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు రూ.18వేల వేతనం అందించాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే సమ్మెలోకి వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీటీఈయూ మండల కన్వీనర్ కంభంపాటి పరుశురాములు, కార్మికులు నర్సయ్య, వెంకటయ్య, శ్రీను, జానయ్య, సైదులు, అర్జున్, లింగయ్య, వెంకన్న పాల్గొన్నారు.

చందంపేట : గ్రామపంచాయతీలో పనిచేసే కార్మికులకు వెంటనే పెండింగ్ వేతనాలను అందజేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి అన్నారు. సోమవారం చందంపేట మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ముందు గ్రామపంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలల నుంచి గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు లేవని, పనిభారం ఎక్కువ అవుతోందన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి నెలకు కనీసం రూ.21వేలు వేతనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సభ్యులు మల్లయ్య, గ్రామపంచాయతీ కార్మికసంఘం మండల అధ్యక్షుడు రమావత్ బొజ్యా, నాగిళ్ల ఇద్దయ్య పాల్గొన్నారు.

పెద్దవూర: గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లేనట్లయితే ఈనెల 19 నుంచి సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా నాయకులు బషీర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమ్మె నోటీసు అందచేసి ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో మంగారెడ్డి, పూర ప్రభాకర్, కృష్ణ, ఏసు, రమణ, నాగరాజు, సురేష్, రాజు, పాపమ్మ పాల్గొన్నారు.

కబడ్డీ విజేత
పోతిరెడ్డిపాడు ఏ జట్టు

పెద్దఅడిశర్లపల్లి, ఏప్రిల్ 7(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి కబడ్డీ పోటీలు రెండు రోజుల పాటు హోరాహోరీగా సాగాయి. పోతిరెడ్డిపల్లి యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పోటీలకు ఉమ్మడి పీఏపల్లి, గుడిపల్లి నుంచి క్రీడాకారులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి జరిగిన ముగింపు పోటీల్లో పోతిరెడ్డిపల్లి-ఏ జట్టు ప్రథమ బహుమతి, పోతిరెడ్డిపల్లి-బి జట్టు ద్వితీయ, గుడిపల్లి తృతీయ, మేడారం జట్టు నాలుగు, అంగడిపేట జట్టు ఐదు, కోదండపురం జట్టు ఆరవ స్థానంలో నిలిచాయి. విజేతలైన జట్లకు దాతలు నగదు బహుమతి, షీల్డులు అందజేశారు. కార్యక్రమంలో దాతలు జినుకల లక్ష్మయ్య, కూన్‌రెడ్డి రాజశేఖర్‌రెడ్డి, జినుకల చంద్ర య్య, వడ్లపల్లి శేఖర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, తూటిపల్లి నాగేష్, గ్రామస్థులు డాక్టర్ పాల్వాయి వెంకట్‌రెడ్డి, చిరసువాడ శ్రీనయ్య, ఉప్పల కోటి, మిల్లు శ్రీను, జినుకల వెంకటయ్య, తాళ్ల మల్లయ్య, ఆంజనేయులు, సత్యనారాయణ, రామాంజనేయులు, సత్యనారాయణ, హరీష్, అరవింద్, సూర్యబాబు, తేజ తదితరులు పాల్గొన్నారు.